@vaartanews @mvnewstv

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

www.mivaartanews.com

TGBIL/25/A0512

మంగళవారం
03 నవంబర్ 2026

సూర్యపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02
సంచిక : 121
పేజీలు : 12 వెల : 5/-



PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE

తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు చరమగీతం





- తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు నూకలు చెల్లినట్టే.. తరిమికొట్టాలి
- భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు
- బేగంపేట నుంచి చార్మినార్ వరకు కేంద్ర హోంమంత్రికి ఘన స్వాగతం
- 'లోకతంత్ర బచావో-అరాచకత హటావో' నినాదంతో బీజేపీ మహా పాదయాత్ర
- ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం: షా
- తెలంగాణను ఏటీఎంగా మార్చుకుని ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ
- రేవంత్ ద్వారా రాహుల్‌కు డబ్బులు వెళ్తున్నాయని వ్యాఖ్యలు

కదంతొక్కిన కాషాయ శ్రేణులు

- త్రివర్ణ పతాకం చేతబూని హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..
- 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' నినాదంతో బీజేపీ ర్యాలీ
- బషీర్‌బాగ్ నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు 1.5 కిలోమీటర్ల మేర పాదయాత్ర
- పాదయాత్రకు ముందు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమిత్ షా ప్రత్యేక పూజలు

11

హైదరాబాద్

తెలంగాణలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. - మిగతా 11 లో



దీపావళికి గ్రీన్ క్రాకర్స్‌కు సుప్రీంకోర్టు ఓకే!

- నవంబర్ 7, 8 తేదీల్లోనే అనుమతి.. రోజుకు రెండు గంటలు మాత్రమే
- ఉదయం 6-7 గంటలు.. రాత్రి 8-10 గంటల వరకు అవకాశం
- ఆస్పత్రులు, విద్యాసంస్థల పరిసరాల్లో 300 మీటర్ల వరకు నిషేధం
- నవంబర్ 9 నుంచి మళ్లీ పూర్తి స్థాయి నిషేధం



భారత వైమానిక దళానికి కొత్త అధిపతి

- 29వ చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్
- ఎయిర్ చీఫ్ మార్షల్‌గా బాధ్యతల స్వీకరణ
- ఏపీ సింగ్ స్థానంలో నియామకం
- నాలుగు దశాబ్దాల సైనిక సేవ.. 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం
- ఆపరేషన్ సింధూర్‌లోనూ కీలక బాధ్యతలు



రోడ్డు పనుల్లో పెను విషాదం..

- విద్యుదాఘాతంతో 8 మంది కార్మికులు మృతి!
- 11 వేల వోల్టుల విద్యుత్ తీగలకు తగిలిన నిర్మాణ యంత్రం
- రాజస్థాన్‌లోని ఝుంఝునూ జిల్లాలో ఘోర ప్రమాదం
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని సీఎం భరోసా
- ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశాలు

విద్యుత్ సిబ్బందికి దీపావళి కానుక

- 2.543 శాతం డీఏ పెంపు!
- తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపు.. 71,360 మందికి ప్రయోజనం!
- 2.543 శాతం పెరిగిన కరువు భత్యం, కరువు సాయం
- 19.272 శాతం నుంచి 21.815 శాతానికి డీఏ పెంపు
- 2026 జూలై 1 నుంచి అమలు.. ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు లబ్ధి
- విద్యుత్ సంస్థలపై నెలకు రూ.14.63 కోట్ల అదనపు భారం

హైదరాబాద్

తెలంగాణ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక అందించింది. నాలుగు ప్రభుత్వ విద్యుత్ సంస్థల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి కరువు భత్యం (డీఏ), పెన్షనర్లకు కరువు ఉపశమనం (డీఆర్) పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డీఏను 2.543 శాతం పెంచడంతో ఇప్పటివరకు ఉన్న 19.272 శాతం నుంచి 21.815 శాతానికి చేరింది. 2026 జూలై 1వ తేదీ నుంచి ఈ పెంపు - మిగతా 11 లో

బీజేపీ ప్రచారం బూమరాంగ్.. దిల్లీలో యథావిధిగా మార్కెట్లు!



- ఇండియా కూటమి ర్యాలీతో వ్యాపారాలకు నష్టం లేదన్న కాంగ్రెస్
- దుకాణాలు తెరిచే ఉన్నాయి.. కొనసాగిన కొనుగోళ్లు
- బీజేపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారు: జైరాం రమేశ్
- స్థానిక వ్యాపారులకు అండగా నిలవాలని రాహుల్ పిలుపు

ట్రాఫిక్ ఫ్రీ నగరమే లక్ష్యం!

నగర పరిశుభ్రత, ట్రాఫిక్ నియంత్రణపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



- హైదరాబాద్‌ను క్లీన్ అండ్ ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలి: సీఎం రేవంత్
- ఇంటింటికీ రోజూ చెత్త సేకరణ.. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- 19 ఎస్టీపీల నుంచి 28 గ్రీన్ ట్యాంకర్లతో శుద్ధి చేసిన నీటి సరఫరా
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల ప్రణాళిక
- హైదరాబాద్ ఇక క్లీన్ అండ్ ట్రాఫిక్ ఫ్రీ సిటీ!
- చెత్త కనిపించకూడదు.. ట్రాఫిక్ నిలిచిపోకూడదు
- గ్రీన్ వాటర్ ట్యాంకర్ల సరఫరా విస్తరణకు సీఎం రేవంత్ ఆదేశాలు
- సిగ్నల్ ఫ్రీ జంక్షన్లకు అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల ప్రణాళిక

హైదరాబాద్


హైదరాబాద్ మహానగరాన్ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడా చెత్త కనిపించకూడదని, ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నగర పరిశుభ్రత, గ్రీన్ వాటర్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ తదితర - మిగతా 11 లో



ఎస్ఐఆర్ దెబ్బ.. ఐదు రాష్ట్రాల్లో 2.28 కోట్ల ఓట్లు మాయం!

- ఓటరు జాబితాల సవరణతో భారీగా తగ్గిన ఓటర్ల సంఖ్య
- ఐదు రాష్ట్రాల్లో 18.71 కోట్ల నుంచి 16.43 కోట్లకు తగ్గుదల
- ఉత్తరప్రదేశ్‌లోనే 2.04 కోట్ల ఓటర్లకు కోత
- అర్హులైన వారికి మరో అవకాశం కల్పిస్తామన్న ఈసీ

రైతులను ఆదుకోవడంలో రేవంత్ సర్కార్ విఫలం



- పాలమూరులో కరువు పరిస్థితులకు కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని విమర్శ
- కృష్ణా జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో వైఫల్యం
- కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 50 టీఎంసీలకు బదులు 18 టీఎంసీలే ఎత్తిపోతలు
- పంట నష్టపోయిన రైతులకు పరిహారం.. యాసంగి రైతుబంధు చెల్లించాలని డిమాండ్

వనపర్తి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. పాలమూరు ప్రాంతంలో నెలకొన్న కరువు పరిస్థితులకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల నుంచి అందుబాటులో ఉన్న కృష్ణా జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో - మిగతా 11 లో

సంపాదకీయం

ఓవర్ టూ హస్తిన..

ఢిల్లీలో రాజకీయ వాతావరణం హీటెక్కింది. బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ నిరసనలకు తెరతీసి నగర వీధులు దద్దరిల్లేలా చేశాయి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సారథ్యంలోని ఇండి కూటమి పార్టీలు ఓట్ చోరీ మార్చ్ నిర్వహించాయి. మరోవైపు, కాంగ్రెస్‌ను టార్గెట్ చేసేందుకు బీజేపీ 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల సంస్మరణార్థంగా మరో ర్యాలీకి నిర్వహించింది.కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సారథ్యంలో ఇండి కూటమి పార్టీలు ఛలో ఢిల్లీ ర్యాలీలో పాల్గొన్నాయి. రామ్‌లీలా మైదానం వరకూ నిర్వహించాయి. నారీ నగర్ బస్‌స్టాప్ నుంచి తిలక్ నగర్ వరకూ బీజేపీ ర్యాలీ నిర్వహించింది. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల కోసం ఉద్దేశించిన రోజున కాంగ్రెస్ తన పొలిటల్ ప్రోగ్రామ్ ప్రారంభించిందని బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది.ప్రతిపక్షాల మార్చ్ మధ్యాహ్నం మింటో రోడ్-కాన్నాట్ ప్లేస్ ప్రాంతంలో ప్రారంభమైంది. సర్ కారణంగా ఓటర్ల జాబితాలో తలెత్తిన లోపాలను సవరించడంతో పాటు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణం రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గే, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తదితర ముఖ్యనేతలు పాల్గొన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు తాము ఉద్యమాన్ని చేపట్టినట్టు కాంగ్రెస్ ప్రకటించింది. ఎన్నికల సంఘం పనితీరుపై కూడా పలు ప్రశ్నలు సంధించింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని పేర్కొంది.1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు సంఘీభావంగా పశ్చిమ ఢిల్లీలోని హరీనగర్ బస్‌స్టాప్ నుంచి తిలక్‌నగర్ మెట్రోస్టేషన్ వరకూ బీజేపీ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, పార్టీలోని ఇతర పెద్దలూ పాల్గొన్నారు. సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు సంఘీభావంగా కార్యక్రమాలు జరుగుతున్న రోజే కాంగ్రెస్ మరో నిరసన కార్యక్రమానికి తెరతీయడంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.పోటాపోటీ నిరసన కార్యక్రమాల నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. రామ్‌లీలా మైదానంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయడంతో పాటు డ్రోన్లు, సీసీటీవీ కెమెరాలతో నిఘా పెంచారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో పారామిలిటరీ సిబ్బంది కూడా పాలుపంచుకున్నారు.జంతర్ మంతర్ వేదికగా సాగిన కాక్రోచ్ ఉద్యమంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించగలిగారు. దానికి కారణం వారి పోరాటంలో ఉన్న స్వచ్ఛమైన ప్రజా ప్రయోజనం, బాధిత వర్గాల ప్రత్యక్ష భాగస్వామ్యం. సమస్య తీవ్రత నేరుగాలక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల భవిష్యత్తుకు సంబంధించినది కావడంతో ఆ ఆందోళనలు ప్రభుత్వానికి చుట్టుముట్టి తప్పనిసరి పరిస్థితుల్లో మంత్రి వైదొలగాల్సి వచ్చింది. అయితే, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ వేదికగా చేపట్టిన ర్యాలీలతో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి దింపగలదా అన్న ప్రశ్నకు సానుకూల సమాధానం రావడం లేదు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని, 13 కోట్ల అర్హుల ఓట్లను అక్రమంగా తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తున్నప్పటికీ.. ఆ అంశాన్ని క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజల తిరుగుబాటుగా మలచడంలో పార్టీ ఘోరంగా విఫలమైంది. తమ ఓటు హక్కు నిజంగానే ప్రమాదంలో పడిందన్న భావన ప్రజల్లో బలంగా నాటుకుని ఉంటే, అది స్వచ్ఛంద ప్రజా ఉద్యమంగా మారి సీఈసీపై తీవ్రమైన నైతిక ఒత్తిడి పెరిగేది. కానీ, కాంగ్రెస్ నాయకత్వం ఈ అంశాన్ని ఒక సాంకేతిక రాజకీయ వివాదంగానే ఉంచి, సాధారణ ఓటరును చైతన్యవంతం చేయలేకపోయింది. ఫలితంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవకపోవడంతో రాహుల్ పోరాటానికి బలం రాలేదు.ప్రజల మద్దతు కొరవడటంతో.. దేశ రాజధానిలో నిర్వహిస్తున్న ర్యాలీలు, సభలు పూర్తిగా కాంగ్రెస్, ఇండియా కూటమి శ్రేణుల సమీకరణకే పరిమితమైపోతున్నాయి. ఎన్నికల సంఘం వంటి అత్యున్నత రాజ్యాంగబద్ధ వ్యవస్థపై రాజకీయ పార్టీ కార్యకర్తలతో మాత్రమే పోరాటం నడిపించినప్పుడు, అది సాధారణ ప్రజల దృష్టిలో ఎన్నికల ఓటమికి సాకులు వెతుక్కునే ఎత్తుగడ గానే కనిపిస్తుంది తప్ప నిజమైన ప్రజాస్వామ్య రక్షణ ఉద్యమంగా తోచదు. ఏ ఉద్యమమైనా వ్యవస్థలను ప్రభావితం చేయాలంటే అందులో సామాన్య పౌరుల ఆవేదన కనిపించాలి; కానీ కేవలం పార్టీ జెండాలు, నాయకుల ప్రసంగాలకే పరిమితమైన నిరసనల వల్ల కాంగ్రెస్‌కు రాజకీయంగా రావాల్సిన మైలేజీ రాకపోగా, రాజ్యాంగ వ్యవస్థలను అస్థిరపరుస్తున్నారనే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది.ఈ పోరాటంలో సాధారణ ప్రజలందరూ భాగస్వాములు కావాలని రాహుల్ గాంధీ పదే పదే పిలుపునిస్తున్నప్పటికీ, సమాజం నుంచి వస్తున్న స్పందన మాత్రం తీవ్ర సందేహాస్పదంగానే ఉంది. ప్రజా ఉద్యమాలకు, రాజకీయ ప్రదర్శనలకు తేడా ఉంటుందన్న ప్రాథమిక నిజాన్ని కాంగ్రెస్ నాయకత్వం విస్మరిస్తోంది. ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి రాని పక్షంలో, ఎన్ని ఢిల్లీ ర్యాలీలు నిర్వహించినా, ఎన్నిసార్లు రాంలీలా మైదాన్‌లో గళమెత్తినా సీఈసీని రాజీనామా చేయించడం , ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గించడం అసాధ్యం. ప్రజా సమస్యలను రాజకీయాలుగా కాకుండా, రాజకీయాలను ప్రజా ఉద్యమాలుగా మార్చడంలో విఫలమవుతున్నంత కాలం కాంగ్రెస్ చేసే పోరాటాలు అరణ్యరోదనగానే మిగిలిపోక తప్పదు.

చమురు రంగంలో తెలుగు సంస్థలు



దేశ సరిహద్దులకు ఆవల ప్రపంచవ్యాప్తంగా భారత వాణిజ్య విజయం అంటే సహజంగా ఐటీ రంగ దిగ్గజ సంస్థలే గుర్తుకు వస్తాయి. ఈ సంస్థలు సకాలంలో మెరుగైన సేవలు అందించి లాభాలు ఆర్జిస్తున్నాయి; భారత యువజనులకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్నాయి; మరీ ముఖ్యంగా భారతీయుల ప్రతిభా పాటవాలకు అంతర్జాతీయంగా ఎనలేని గుర్తింపును సాధిస్తున్నాయి. ఈ కారణంగానే సమకాలీన భారతీయ వాణిజ్య విజయాలకు ఐటీ సంస్థలు ప్రతీకలుగా వెలుగొందుతున్నాయి. ఇటీవల కొంతకాలంగా ఐటీ సంస్థలకు అదనంగా భారతీయ ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల సంస్థలూ విదేశాలలో విజయవంతంగా విస్తరిస్తున్నాయి. ఇది శుభ పరిణామం. ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రపంచంలో అగ్రభాగాన నిలిచే చమురు నిక్షేపాల నెలవులు అయిన గల్ఫ్ అరబ్బు దేశాలలో ఈ సంస్థలు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి.

వాస్తవానికి భారతీయ ఇంజినీరింగ్, నిర్మాణ రంగ సంస్థలకు అరబ్బు దేశాలు కొత్త కాదు. చమురు ఎగుమతి ఆరంభ కాలం (1970వ దశకం)లో టాటా గ్రూప్ భాగస్వామి అయిన అగ్రగామి కాంట్రాక్టింగ్ కంపెనీ 'షాపూర్జీ పల్లోంజీ' గల్ఫ్ దేశాలలో సివిల్ నిర్మాణాలను విరివిగా చేపట్టింది. ఈ ఎడారి దేశాలలో మట్టి సరిగ్గా అందుబాటులో ఉండదు. దీంతో అవసరమైన మట్టిని షాపూర్జీ పల్లోంజీ కంపెనీ భారతదేశం నుంచి నౌకలలో తీసుకువచ్చేది. అప్పుడే ఆ కంపెనీ యువ ఇంజినీరు ఎ.పి.జితేందర్ రెడ్డిని కూడా ఉద్యోగ వీసాపై గల్ఫ్‌కు తీసుకువచ్చింది. సుదీర్ఘకాలం అరబ్బు దేశాలలో ఉన్న జితేందర్ దేశానికి తిరిగి వెళ్లి పార్లమెంటుకు పోటీ చేసి ఎన్నికయ్యారు. ఎలక్ట్రో--మెకానికల్ రంగంలో ప్రముఖ భారతీయ సంస్థ 'ఎల్ అండ్ టీ' పూర్తి చేసిన 65 బిలియన్ డాలర్ల విలువైన పనులలో దాదాపు సగం సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్ దేశాలకు చెందినవే కావడం విశేషం. ఎడారి ఉష్ణోగ్రతలో ఎయిర్ కండిషన్ ఇంజినీరింగ్ భారీ కాంట్రాక్టులను ప్రపంచ దిగ్గజ బహుళజాతి సంస్థలతో పోటీపడి ఎల్ అండ్ టీ విజయవంతంగా పూర్తిచేసింది. మారుమూల ఇసుక ఎడారుల గుండా హై వోల్టేజీ విద్యుత్ లైన్ల నిర్మాణంలో కూడా ఎల్ అండ్ టీ తన విశిష్టతను చాటింది. గల్ఫ్ దేశాలలో పైపులైను వ్యవస్థ అత్యంత కీలకమైనది. నీటి వనరులు లేని ఈ ఎడారి దేశాలలో వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్ర తీరం నుంచి శుద్ధి చేసిన ఉప్పు నీటిని నగరాలకు సరఫరా చేయడం, చమురును నౌకాశ్రయాల వరకు రవాణా చేయడానికి పైపులు ప్రధాన ఆధారాలు. ఈ పైపుల నిర్మాణం, సరఫరా పనుల్లో భారతీయ సంస్థలే ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. చమురు పైపుల నిర్మాణం, నిర్వహణలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన నిపుణులు పెట్టింది పేరు.

గల్ఫ్ దేశాలు అంటే చమురు, గ్యాస్‌కు మారుపేరు. ఈ దేశాలలో ప్రతి వ్యవస్థ ఈ రంగంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుసంధానమై ఉంటుంది. నిరంతర విస్తరణ, నిర్వహణ పనులు ఉండే ఈ రంగంలో ఇప్పటి వరకు భారతీయ సంస్థలు ఏవీ కూడా పోటీపడలేదు. సాధారణంగా అమెరికా, జర్మనీ, బ్రిటన్ దేశాల ఇంజినీరింగ్ సంస్థలే ఇందులో సదా అగ్రగాములుగా ఉంటాయి.

ప్రప్రథమంగా భారతీయ సంస్థలు అందునా తెలుగు రాష్ట్రాలకు చెందిన సంస్థలు చమురు రంగంలో సాహసోపేతంగా అడుగుపెడుతున్నాయి. చమురు ఉత్పాదకతలో విడుదలయ్యే వివిధ రసాయనాలను వేరు చేస్తూ నికర చమురును తీయడం ఒక ముఖ్య ప్రక్రియ. ఇందుకు అవసరమైన ప్లాంట్లను సాధారణంగా పాశ్చాత్య దేశాల సంస్థలు మాత్రమే నిర్మిస్తాయి. ఈ రకమైన నిర్మాణ పనుల కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజినీరింగ్ సంస్థ కువైత్‌లో దక్కించుకుని ప్రపంచ ఇంజినీరింగ్ సంస్థలను ఆశ్చర్యానికి గురిచేసింది. 381 మిలియన్ డాలర్ల ఈ కాంట్రాక్టు చమురు రంగంలో భారతీయ సంస్థల ప్రాబల్యానికి ఒక తిరుగులేని నిదర్శనం. ఇంతకు ముందూ కువైత్ చమురు సంస్థ నౌకదానిలో 225 మిలియన్ డాలర్ల కాంట్రాక్టును మేఘా సంస్థే దక్కించుకుంది. సౌదీలో 300 కిలోమీటర్ల పైపు లైను ద్వారా మక్కా పుణ్యక్షేత్రానికి ఐదు లక్షల క్యూసెక్కుల మంచి నీరు సరఫరా చేసే అర్హత పొందిన సంస్థల జాబితాలో కూడా మేఘా ఉన్నది.

తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రోగ్రెసివ్, రాంకీ, జి.యం.ఆర్ సంస్థలు గతంలో వివిధ రంగాలలో కొన్ని పనులు చేసినా కీలకమైన చమురు రంగంలో మేఘా ప్రవేశమే భారతీయ కంపెనీలకు ఒక కొత్త ప్రారంభమని చెప్పవచ్చు. భారత వాణిజ్య విజయాలలో ఇదొక ఉజ్వల అధ్యాయం. ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ ఐటీ సంస్థల జైత్రయాత్రను ఇంజినీరింగ్ సంస్థలూ కొనసాగించాలి.

విదేశీ పర్యటనల విధి విధానాలు

సార్వభౌమాధికారం అనేది ఒక దేశానికి తన విదేశీ వ్యవహారాలపై ఉండే సర్వోన్నతమైన, స్వతంత్ర అధికార పర్యవేక్షణ. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలోనైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ జాతీయ స్థాయిలో మాత్రమే ఉంటుంది. మన దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం సంస్థానాధీశులు స్వతంత్ర రాజులుగా సర్వాధికారాలు చలాయించినా విదేశీ వ్యవహారాలు బ్రిటన్ పర్యవేక్షణలో ఉండేవి. స్వాతంత్ర్యం సిద్ధించాక అవి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నాయి. కేంద్రం పరిధిలోని విదేశాంగ మంత్రిత్వశాఖ మన దౌత్య విధానాలను అమలుపరుస్తున్నది. విదేశాలకు వెళ్లే సగటు భారతీయుడికి అవసరమైన పాస్‌పోర్టు మొదలు విదేశీ గమ్యస్థానం చేరుకున్న తర్వాత అక్కడ అతడి నడవడిని సైతం మన దౌత్య అధికారులు సదా గమనిస్తుంటారు. విదేశాలలోని మన రాయబారుల కార్యాలయాలు సంబంధిత దేశంలో మన అధికార ప్రముఖుల పర్యటనలను సమన్వయం చేస్తుంటాయి. ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు విదేశాంగశాఖ ఆక్షేపణ తెలిపింది. దీంతో రేవంత్ తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. బ్రిటన్‌లో పర్యటనను పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగిరావడం ప్రజల్లోను, రాజకీయ వర్గాలలోను చర్చనీయాంశమయింది.

ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల మంత్రుల అధికారిక విదేశీ పర్యటనలకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం అనేది రాజకీయాలకు అతీతంగా జరిగే సాధారణ ప్రక్రియ. అధికార ప్రముఖుల విదేశీ పర్యటనలను విదేశాంగ విధానానికి అనుగుణంగా సమన్వయపరచడం విదేశీ వ్యవహారాల శాఖ విధి. బహిరంగంగా వెల్లడించలేని విధానానికి విభిన్నంగా పర్యటనలు ఉంటే వాటిని ఆక్షేపించడం, ఆపడం కూడా విదేశాంగశాఖ బాధ్యత. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్.. తెలుగువాడైన ఒక కేంద్ర మంత్రికి విదేశాల నుంచి ఆహ్వానం ఉన్నా వారి పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. తెలుగువాడైన మరో కేంద్ర మంత్రి విదేశాల్లో ఒక సదస్సుకు వెళ్లేందుకు అనుమతించారు. గతంలో కొందరు ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు అనుమతి ఇవ్వలేదు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు.. పాకిస్థాన్‌లో సీనియర్ ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇచ్చే అడ్మినిస్ట్రేటివ్ కాలేజీలో ఉపన్యాసం ఇవ్వడంతో పాటు నవాజ్ షరీఫ్ సహా పలువురు రాజకీయ నాయకులను కలవడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2012లో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్.. పాకిస్థాన్ పర్యటనలో జిన్నా సమాధిని సందర్శించేందుకు అనుమతించింది. అయితే 2026లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు ఆక్షేపణ తెలిపింది. ఈ అనుమతి నిరాకరణపై రాజకీయ రాద్ధాంతం చేయకుండా లండన్ నుంచి హుందాగా వెనక్కివచ్చి ఆయన కూడా విజ్ఞత ప్రదర్శించారు. తిరిగి వచ్చిన అనంతరం విలేఖరుల సమావేశంలో ఆచితూచి మాట్లాడారు.

ఒకప్పుడు విధి విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వ అధికారిక బృందాలు పరిమిత సంఖ్యలో విదేశీ పర్యటనలు చేసేవి. ఆ తర్వాత పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెట్టుబడుల కోసం ఉన్నతాధికారులతో సహా విదేశీ పర్యటనలకు వెళ్లడం ప్రారంభమయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడే ఈ తరహా విదేశీ పర్యటనలకు నాంది పలికారు. అవి సాధించిన సత్ఫలితాలకు ఆకర్షితులై గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ, ఆ తరువాత ఇతరులు విదేశీ పర్యటనలు చేశారు. పిదప, రాష్ట్రాల మంత్రులు సైతం విదేశీ పర్యటనలు మొదలుపెట్టారు. ముఖ్యమంత్రుల, రాష్ట్ర మంత్రుల విదేశీ పర్యటనల వ్యయాన్ని రాష్ట్రాలే భరిస్తాయి. అయితే వీటి పట్ల జాతి దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని విదేశీ వ్యవహారాలశాఖ వ్యవహరిస్తోంది. అది స్వంత ఖర్చుతో వ్యక్తిగత పర్యటన అయినా కూడా విధిగా కేంద్రానికి సమాచారం అందించాలనే నిబంధన ఒకటి ఉన్నది. రాష్ట్రాల నేతలు విదేశీ గడ్డపై తమ రాష్ట్ర రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా మాట్లాడినా, అది జాతీయ విధానానికి భిన్నంగా ఉంటే, దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది కదా. అటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా కేంద్రం జాగ్రత్త వహిస్తుంది. విదేశాలకు వెళ్లినప్పుడు మర్యాద మన్ననలతో వ్యవహరించడం ముఖ్యం. ఏ దేశంలో ఏమి మాట్లాడాలో, ఏమి మాట్లాడకూడదో, ఎవరు ఏ స్థాయిలో ఎవరితో కలవాలి, ఎవరితో కలవకూడదు... అనే విషయమై కేంద్ర, రాష్ట్రాల అధికారిక బృందాలకు విదేశాంగశాఖ మార్గదర్శకం చేస్తుంది. విదేశాలలో ఎవరు అతిథ్యమిస్తున్నారు, ఎవరితో సమావేశమవ్వాలనుకుంటున్నారు ఇత్యాది విషయాలకు సంబంధించి సమగ్ర వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. చివరకు ఎవరైనా బహుమానం ఇస్తే స్వీకరించాలా వద్దా అనేది కూడా రాయబార కార్యాలయం నిర్దేశిస్తుంది. అవతలి వ్యక్తిని బట్టి వస్త్రధారణను సైతం సూచిస్తుంది. భారతీయ అధికార బృందాలు విదేశీ ప్రతినిధులతో సమావేశమైనప్పుడు వారు ఏమేమి మాట్లాడారు, ఏ రకంగా వ్యవహరించారనేది కూడా పక్కన ఉండే భారతీయ దౌత్యవేత్తలు క్షుణ్ణంగా గమనిస్తూ న్యూఢిల్లీకి నివేదిస్తారు. ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణతో విదేశీ పెట్టుబడులు, వలసలకు ప్రాధాన్యం పెరిగిన కాలమిది. భారత నాయకులు ప్రత్యేకించి ప్రతిపక్ష నేతల విదేశీ పర్యటనల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలని, రాజకీయాలకు అతీతంగా వాటిలో సమాఖ్య స్ఫూర్తి ప్రతిబింబించాలని రేవంత్‌రెడ్డి ఉదంతంలో యూఏఈ మాజీ భారత రాయబారి కె.సి.సింగ్ వ్యాఖ్యానించడం ముదావహం.

ప్రకాష్ రాజ్ కు అవకాశాలు తక్కువ

దశాబ్దాలుగా వర్సటైల్ నటుడిగా భారతీయ సినిమాలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రకాష్ రాజ్, ఈమధ్య కాలంలో తరచూ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా తనకు చిత్ర పరిశ్రమలో అవకాశాలు తగ్గడానికి రాజకీయాలు మాట్లాడటమే కారణమంటూ ఆయన భార్య పోనీ వర్మతో మిడియా ఇంటర్యూల్లో చెప్పిస్తున్నారు.ప్రకాష్ రాజ్ ఈనాటి నుంచి కాదు, కొన్నేళ్లుగా బహిరంగంగా రాజకీయ వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. అంతటి తీవ్రమైన రాజకీయ అభిప్రాయాలు వ్యక్తం చేసిన కాలంలోనూ ఆయనను ఇండస్ట్రీ ఆదరించింది, వరుస అవకాశాలు ఇచ్చింది.మరి ఇప్పుడు అవకాశాల గ్రాఫ్ కాస్త తగ్గేసరికి రాజకీయాల వల్లే తనను తొక్కేస్తున్నారంటూ నెపం నెట్టేయడం ఎక్కడి న్యాయమనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.ఒక నటుడు రాజకీయాల్లోకి వచ్చినంత మాత్రాన సినీ పరిశ్రమ వారిని దూరం పెడుతుందనుకోవడం పూర్తిగా అపోహే. చలనచిత్ర చరిత్రను పరిశీలిస్తే ఎన్టీఆర్, ఎంజీఆర్, కమల్ హాసన్, పవన్ కళ్యాణ్ వరకు ఎంతో మంది నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తూనే సినిమాల్లోనూ రికార్డు విజయాలు సాధించారు. రాజకీయ అభిప్రాయాలు ఉన్న ప్రతి నటుడికి ఇండస్ట్రీ ఎప్పుడూ రెడ్ కార్పెట్ పరచి నెత్తిన పెట్టుకోవాలని కోరుకోవడం కూడా సమంజసం కాదు. వయసు రీత్యా పాత్రల ఎంపిక మారడం, నూతన నటీనటుల రాక, ప్రేక్షకుల అభిరుచుల్లో మార్పుల వల్ల ఎంతో మంది దిగ్గజ నటులకు అవకాశాల తీవ్రత తగ్గుతుంటుంది. కానీ దానికి తమ సొంత రాజకీయ ఎజెండాను జోడించి సానుభూతి పొందే యత్నం చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న వస్తోంది.ఇక రాజకీయంగా పవన్ కళ్యాణ్‌పై నిత్యం ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించే ప్రకాష్ రాజ్, వ్యక్తిగత ప్రాధాన్యతలకు పవన్ కళ్యాణ్ ఇచ్చే గౌరవాన్ని విస్మరిస్తున్నారు. సిద్ధాంత పరంగా విభేదాలు ఉన్నప్పటికీ, ప్రకాష్ రాజ్‌లోని నటుడిని గౌరవిస్తూ పవన్ కళ్యాణ్ తన అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం ఓజీ లో ఆయనకు కీలక పాత్ర ఇచ్చారు. రాజకీయాలు వేరు, వృత్తి వేరు అనే ఉదారతను పవన్ కళ్యాణ్ నిరూపించినప్పటికీ.. వార్తల్లో నిలిచేందుకో మళ్లీ పవన్ పైనే నిందలు వేయడం ప్రకాష్ రాజ్ ద్వంద్వ వైఖరికి నిదర్శనంగా కనిపిస్తోంది.సినీ పరిశ్రమ అనేది కేవలం సృజనాత్మకత, వ్యాపార సూత్రాల ఆధారంగా నడుస్తుంది తప్ప, కేవలం ఒకరి రాజకీయ అభిప్రాయాల ఆధారంగా అవకాశాలను నిలిపివేసేంత చిన్న మనస్తత్వంతో ఉండదు. తనకున్న నటన ప్రతిభతో ఎన్నో అద్భుతమైన పాత్రలను పండించిన ప్రకాష్ రాజ్, స్వీయ విశ్లేషణ చేసుకోకుండా రాజకీయ బాధితుడిని అని కలరింగ్ ఇచ్చుకోవడం ఆయన స్థాయికి తగదని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఒక ఆర్టిస్టుగా ప్రజాదరణ పొందడం వేరు, రాజకీయ లబ్ధి కోసం ఇండస్ట్రీపై బురద చల్లడం వేరనే విషయాన్ని ప్రేక్షకులు కూడా గమనిస్తూనే ఉన్నారు.

సోషల్ మీడియాలో జెన్ జీ బాబా...

లక్నో : ఆధ్యాత్మిక గురువులు తమ ప్రవచనాలు, బోధనల ద్వారా గుర్తింపు పొందుతుంటారు. అయితే బృందావన్‌కు చెందిన ఓ గురువు తన యంగ్ లుక్స్‌తో సోషల్ మీడియా స్టార్‌గా మారిపోయారు. ఆయనకు వచ్చిన 'జెన్ జీ బాబా' పేరు నెట్టింట ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. యవ్వనంగా కనిపించే రూపం, స్టైలిష్ లుక్స్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నా యి.సోషల్ మీడియా పుణ్యమా అని రోజుకో కొత్త వ్యక్తి వెలుగులోకి వస్తున్నారు. కొందరు తమ టాలెంట్‌తో గుర్తింపు తెచ్చుకుంటే.. మరికొందరు ప్రత్యేక వ్యక్తిత్వంతో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా బృందావన్‌కు చెందిన శ్రీ శాశ్వత్ ఆచార్య ఆధ్యాత్మిక గురువుగా గుర్తింపు పొందారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'యంగ్ భాగవత కథా వాచక్'గా పరిచయం చేసుకున్నారు. బృందావన్‌లోని శ్రీధామ్ గోదా విహార్ మందిర్‌కు పీఠాధీశ్వరుడిగా వ్యవహరిస్తున్నారు. భాగవత కథలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పడం ఆయన వృత్తి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే మతపరమైన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సమావేశాల్లో పాల్గొంటుంటారు.తన సోషల్ మీడియా ఖాతాల్లో ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఎప్పటికప్పుడు పోస్ట్ చేస్తుండటంతో ఫాలోవర్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. అతని యూట్యూబ్ ఛానల్‌లో ఆధ్యాత్మిక ప్రవచనాలు, వివిధ కోర్సులకు సంబంధించిన వీడియోలు అందుబాటులో ఉన్నాయి.సాధారణంగా ఆధ్యాత్మిక గురువులు ప్రవచనాలు, బోధనల ద్వారా ప్రజల్లో గుర్తింపు పొందుతుంటారు. కానీ శాశ్వత్ ఆచార్య విషయంలో మాత్రం పరిస్థితి కాస్త భిన్నంగా ఉంది. యవ్వనంగా కనిపించే రూపం, స్టైలిష్ లుక్స్ నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆయన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు సరదాగా 'జెన్ జీ బాబా' అని పిలవడం ప్రారంభించారు. దీంతో ఆయన పోస్టుల కింద కామెంట్ల వర్షం కురుస్తోంది. శాశ్వత్ ఆచార్య ఫొటోలు, వీడియోలు చూసిన నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ఆయనను చూసిన తర్వాత తమకు కూడా ఆధ్యాత్మికతపై ఆసక్తి పెరుగుతోందంటూ కొందరు సరదాగా కామెంట్లు చేస్తున్నారు. చర్మ సౌందర్యం రహస్యమేంటని సరదాగా ప్రశ్నిస్తున్నారు. ఆశీర్వాదాల కోసం వస్తూ ఆకర్షణకు అభిమానులుగా మారిపోతున్నారని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పే యువ గురువు యంగ్ లుక్స్‌తో సోషల్ మీడియా స్టార్‌గా మారిపోయారు.

ఘనంగా అంబేద్కర్ యువజన సంఘం 50వ ఆవిర్భావ ఉత్సవాలు

చిట్యాల నవంబర్ 2 (మీవార్త)

చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ సృష్టి కర్త, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి ఆశయా సాధన కోసం గత 50 సంవత్సరాలుగా ఆవిరామంగా కృషి చేస్తున్నా అంబేద్కర్ యువజన సంఘం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో 50వ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జాతీయ అవార్డు గ్రహీత పుల్ల మల్లయ్య చిట్యాల గ్రామ ఉపసర్పంచ్ బీజేపీ మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి కేక్ కట్ చేయగా మండల అధ్యక్షులు జన్నె యుగేందర్ 50వ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ లు మాట్లాడుతూ 1976వ సంవత్సరములో అణగారిన



వర్గాల ఆత్మ గౌరవం కోసం అంబేద్కర్ ఆలోచనలు సిద్ధాంతాలను యువతలోకి తీసుకెళ్ళాలనే లక్ష్యంతో స్థాపించబడిన అంబేద్కర్ యువజన సంఘం 50 వసంతాలు పూర్తి చేసుకోవడం చరిత్రలో ఒక మైలు రాయిదాటిందాన్నారు. నాటి నుండి నేటి వరకు దళితుల విద్యా ఉద్యోగ సామాజిక ఆర్థిక రాజకీయ మన హక్కుల కోసం రిజర్వేషన్ల పరిరక్షణ కోసం రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశ రాష్ట్ర వ్యాప్తంగా దళితుల పై మహిళల పై జరుగుతున్న అనేక సంఘటనలపై సంఘం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈ నెల 14న హైదరబాద్ లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే 50వ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను దళిత బహుజన నాయకులు మేదావులు విద్యావంతులు ఉద్యోగులు శ్రేయోభిలాషులు మిత్రులు వివిధ సంఘాల నాయకులు అన్ని రాజకీయ పార్టీల నాయకులు అంబేద్కర్ వాదులు మహిళలు కుల మతాలకు రాజాకీయ పార్టీలకు అతీతంగా అందరూ విచ్చసి ఉత్సవాలను విజయ వంతం చేయాలని ఏ వై ఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లయ్య అన్నారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం భూపాల్ పెళ్లి నియోజకవర్గ కన్వీనర్ అరకొండ రాజయ్య. చిట్యాల మండల ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్. మొగుళ్ళపల్లి మండల అధ్యక్షులు మంగళపెల్లి శ్రీనివాస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల భద్రయ్య. ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా నాయకులు ఎంఎస్పి మండల అధ్యక్షులు దొడ్డే శంకర్. వార్డు సభ్యులు పుల్ల నిర్మల సతీష్ కుమార్. శనిగరపు మొగిలి. మైదానం కావ్య శ్రీకాంత్ .అంబేద్కర్ వాదులు గురుకుంట్ల కిరణ్. మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు .గుర్రపు రాజమౌళి .గడ్డం సదానందం. పర్లపల్లి కుమార్. కొర్రి సాంబశివుడు. గుర్రపు శంకర్. అరకొండ రాకేష్ .కట్కూరి రాజేందర్. తదితరులు పాల్గొన్నారు

ప్రజావాణికి అధికారులు గైర్హాజరు

- చర్యలు తీసుకోవడంలో ఎంపీడీవో నిర్లక్ష్యం!

- ప్రజావాణికి 22 శాఖల అధికారులు హాజరు కావాల్సిందే -- మారపల్లి మల్లేష్ డిమాండ్

చిట్యాల నవంబర్02 (మీవార్త) :

టేకుమట్ల: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి 22 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా, కేవలం ఐదు, ఆరు శాఖల అధికారులు మాత్రమే హాజరవుతున్నారని సిపిఐ ఎంఎల్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ ఆరోపించారు.

ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. అయితే టేకుమట్ల మండలంలో ప్రజావాణికి సంబంధిత శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అనేక సమస్యలతో ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారి సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి 22 శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా మండల అభివృద్ధి అధికారి చర్యలు తీసుకోవాలని డిమాండ్





చేశారు. అధికారులు గైర్హాజరవుతున్నప్పటికీ ఎంపీడీవో ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజావాణికి హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి సోమవారం అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని మారపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా ప్రజావాణి కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని కోరారు.

ప్రతి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

చిలుకానగర్, నవంబర్ 2 (మన మీ వార్త):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉమ్మడి చిల్కానగర్ డివిజన్ పరిధిలోని బీరప్పగడ్డ డివిజన్ రాఘవేంద్రనగర్ కాలనీలో ఉన్న సెయింట్ గాబ్రియేల్ ప్రైవేట్ పాఠశాలలో ఎమ్మెల్సీ ఓటరు అవగాహన, నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటును ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధానాల్లో పూర్తి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో నమోదు చేసుకునేందుకు పాఠశాల యాజమాన్యానికి ఫారం-18 అందజేశామని, అర్హులు వాటిని పూర్తిచేసి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జతచేసి సమర్పించాలని సూచించారు.అదేవిధంగా ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు చేసుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ల్యాప్‌టాప్‌లతో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును నమోదు





చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యానికి ప్రతీక అని పేర్కొన్నారు.'మీ ఓటు మీ హక్కు.. మీ గొంతుకకు గుర్తింపు' అనే నినాదంతో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.

అమిత్ షా మహా పాదయాత్రకు వెంకటరెడ్డి నగర్ డివిజన్ నుంచి భారీగా తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు



- కాంగ్రెస్ అసత్య ప్రచారాలను ప్రజల్లో ఎండగడతాం: ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లపు జగన్ యాదవ్

వెంకటరెడ్డి నగర్, నవంబర్ 2 (మన మీ వార్త):

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ఆరోపణలు, తప్పుడు ప్రచారాలను ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేపట్టిన మహా పాదయాత్రకు వెంకటరెడ్డి నగర్ డివిజన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో



తరలివెళ్లారు. భాగ్యనగరంలో నిర్వహించిన ఈ మహా పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లపు జగన్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా అనేక అసత్య ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను ప్రజల్లో ఎండగట్టడంతో పాటు వాటిని ఖండించేందుకే కేంద్ర హోంమంత్రి అమిత్ షా భాగ్యనగరంలో మహా పాదయాత్ర చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వెంకటరెడ్డి నగర్ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి పాదయాత్రలో పాల్గొన్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చెల్లోజు ఎల్లాచారి, పుచ్చుల అశోక్, తుమ్మలి రవి, గోవింద్ బాక్స్ హరిబాబు, సౌదం మహేష్, గాజుల మల్లయ్య, ప్రతాప్ శీలం సుధా తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకై పయనిద్దాం. ప్రగతి పథంలో పయనిద్దాం

- సిపిఐ (ఎంఎల్) నిర్మల్ జిల్లా నాయకులు ఎస్. గంగన్న

లక్ష్మన్ చందా, నవంబర్ 02(మీ వార్త) :



మండలం లోని వడ్యాల్ గ్రామం లో నవంబర్ 1 నుండి 10 వరకు గ్రామ గ్రామాన అమరవీరుల సంస్మరణ సభలు జరపమని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపు లోభాగంగా ఈరోజు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా , గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ జరిగింది.. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ఎస్ గంగన్న.మాట్లాడుతూ దేశంలోనే పీడిత ప్రజల కోసం తినటానికి తిండి కావాలని ఉండటానికి ఇల్లు కావాలని కట్టుకోవటానికి బట్ట కావాలని పేద ప్రజల కోసం దోపిడీ రహిత సమాజాన్ని నిర్మించాలని లక్ష్యంతొ తమ అమూల్యమైన లక్ష్యాలనువిడిచి పేద ప్రజల కోసం పోరాడి అసువులు బాసిన ఎంతోమంది అమరవీరులను స్మరించుకొని నివాళి అర్పించారని..అమరవీరులు చూపిన బాటలో మనమందరం పయనించాలని వారి ఆశయ సాధన కోసం ఎర్రజెండాను మన భుజాస్కందాలపై ఉన్నదని ..అమరవీరులు సాధించి పెట్టిన హక్కులను కాపాడుకో కొనుటకు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంద నిర్వహిస్తున్న రాజీలేని పోరాటంలో అశేష ప్రజానీకం మమేకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలొ భాగ్య. గంగామణి. పూజ. లక్ష్మి. మండల నాయకులు పాల్గొన్నారు.

కేబుల్ ఛానల్ జర్నలిస్టుల పోరాటానికి టీడబ్ల్యూజేఎఫ్ సంపూర్ణ మద్దతు

- టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మల్లేష్ గౌడ్

హైదరాబాద్, నవంబర్ 02 (మీ వార్త ప్రతినిధి) :



తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సమాచారాన్ని అందిస్తున్న కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లను ప్రభుత్వం అణిచివేసే కుట్ర చేస్తోందని టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బి. మల్లేష్ గౌడ్ విమర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ల జర్నలిస్టులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలిపారు.

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ఆదేశాల మేరకు కేబుల్ ఛానళ్ల జర్నలిస్టుల పోరాటానికి రాష్ట్ర కమిటీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.చిన్న పత్రికలు, కేబుల్ ఛానళ్ల సంఖ్యను తగ్గించాలనే కుట్రలో భాగంగానే ఇటీవల ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) నెట్‌వర్క్ ద్వారా ప్రసారాలు చేస్తున్నాయనే సాకుతో అనేక కేబుల్ ఛానళ్లకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. లక్షల రూపాయల పెట్టుబడులతో నడుస్తున్న అసలైన కేబుల్ ఛానళ్లకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా, అనర్హులకు కార్డులు కేటాయించారని విమర్శించారు.కేబుల్ ఛానళ్ల నిర్వాహకులు కూడా జర్నలిస్టులేనని, వారు ప్రభుత్వాన్ని కోరుతున్నది కేవలం అక్రెడిటేషన్ కార్డులేనని, గొంతెమ్మ కోర్కెలు కాదని మల్లేష్ గౌడ్ పేర్కొన్నారు.గతంలో కేబుల్ ఛానళ్లకు జిల్లాకు నాలుగు అక్రెడిటేషన్ కార్డులు, రాష్ట్ర స్థాయిలో 12 కార్డులు ఉండేవని, ప్రస్తుతం వాటిని సగానికి తగ్గించారని తెలిపారు. దీంతో ఒకవైపు ప్రభుత్వ ప్రకటనలు లేక, మరోవైపు అక్రెడిటేషన్ కార్డులు అందక అనేక కేబుల్ ఛానళ్లు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిజం వృత్తిపై ఆధారపడి ఎన్నో ఏళ్లుగా ఛానళ్లను నిర్వహిస్తున్న వేలాది మంది జర్నలిస్టులను ప్రభుత్వం రోడ్డున పడేస్తోందని ధ్వజమెత్తారు.పోరాడి సాధించుకున్న తెలంగాణలో చిన్న పత్రికలు, కేబుల్ ఛానళ్లను చిన్నచూపు చూడటం సరికాదని అన్నారు. ఐపీ ఛానళ్ల పేరుతో కేబుల్ ఛానళ్లను మూసివేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న కేబుల్ ఛానళ్లకు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా న్యాయబద్ధంగా అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని మల్లేష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రెడిటేషన్ల సాధన కోసం కేబుల్ ఛానళ్ల యజమానులు, జర్నలిస్టులు చేస్తున్న పోరాటానికి టీడబ్ల్యూజేఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

నేర్ధం భాస్కర్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఈ నెల 5న మెగా ఉచిత వైద్య శిబిరం

- ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: నేర్ధం భాస్కర్ గౌడ్

ఉప్పల్, నవంబర్ 2 (మన మీ వార్త):



బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ ఉద్యమకారుడు నేర్ధం భాస్కర్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీ గురువారం నేర్ధం బాలయ్య, భాగ్యలక్ష్మి ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలకు ఆరోగ్య సేవలను అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఉప్పల్--చిల్కానగర్ ప్రధాన రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న నోవా బ్యాంకెట్ హాల్‌లో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం కొనసాగనుంది.ఈ శిబిరంలో భాగంగా మెగా ఉచిత కంటి వైద్య శిబిరం, ఉచిత కంటి పరీక్షలు, అవసరమైన వారికి ఉచిత కళ్లద్దాల పంపిణీ చేపట్టనున్నారు. డాక్టర్ నేర్ధం మనీషా గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. అదేవిధంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు.ఈ సందర్భంగా నేర్ధం భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆరోగ్య సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఉప్పల్, చిల్కానగర్ పరిసర ప్రాంతాల ప్రజలు, వృద్ధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని నేర్ధం భాస్కర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత ఎమ్మెల్సీ ఓటరు నమోదు

- ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్

నర్సంపేట నవంబర్ 2 మీవార్త ప్రతినిధి) :



నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో నవంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు ఉచిత ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ తెలిపారు. కళాశాలలోని వాణిజ్యశాస్త్ర విభాగం, ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా ఈ సేవలను అందించనున్నట్లు పేర్కొన్నారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు తమ కంప్యూటర్ పరిజ్ఞానంతో అర్హులైన పట్టభద్రులకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తులు సమర్పించడంలో సహకరిస్తారని తెలిపారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు, వారు నేర్చుకున్న సాంకేతిక నైపుణ్యాలను సమాజ సేవకు వినియోగించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులైన పట్టభద్రులు డిగ్రీ మెమో, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ నంబర్), పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో కళాశాలను సంప్రదించి ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎన్‌సీసీ కేర్‌టేకర్ డాక్టర్ రాజీరును సంప్రదించాలని సూచించారు.

పగిడిపల్లె శివారు చెరువులో మట్టి అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

టేకుమట్ల నవంబర్ 2 (మన మీ వార్త)



మండలంలోని పగిడిపల్లె గ్రామ శివారులో ఉన్న చెరువులో మట్టిని తీసిన వారిపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రామ్ రామ్ చందర్ మాదిగ డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో టేకుమట్ల తహసీల్దార్ కి వినతిపత్రం అందజేశారు. పగిడిపల్లె గ్రామ శివారులోని చెరువులో మట్టిని తీసి తరలించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని వారు కోరారు.చెరువులు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైనవని, వాటి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చెరువులో మట్టిని అనుమతులు లేకుండా తీసినట్లయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మట్టి తవ్వకాలకు సంబంధించిన అనుమతులు, అధికారుల పర్యవేక్షణపై విచారణ చేపట్టాలని అధికారులను కోరారు.ప్రభుత్వ చెరువుల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మారపల్లి మల్లేష్, రామ్ రామ్ చందర్ మాదిగ డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో వారు పాల్గొని తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సిపిఐ ఎంఎల్ మండల కార్యదర్శి అంబాల అశ్వద్ధామ పాల్గొన్నారు.

రిషికేశ్ ఆలయాన్ని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు



ఖానాపురం నవంబర్ 2 (మల్లేష్ మీవార్త ప్రతినిధి) :

ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని పవిత్ర గంగానదిలో ఖానాపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పుణ్యస్నానం ఆచరించి, రిషికేశ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో ఖానాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నర్సంపేట ఏఎంసీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ఖానాపురం పీఏసీఎస్ చైర్మన్ , వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వల్లే శ్రీనివాస్ యాదవ్ , ఖానాపురం పీఏసీఎస్ డైరెక్టర్లు శివరాత్రి వెంకన్న, దేవినేని వేణుగోపాల్ రావు, మూడు పూల్ సింగ్, సర్పంచ్ వినోద్ కుమార్, పిండి కుమార్ యాదవ్, ఎస్.కె. కమాలుద్దీన్, నునావత్ మోహన్ నాయక్, ఖానాపురం మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ నాంచారి కుమారస్వామి యాదవ్, యూత్ అధ్యక్షుడు బైరబోయిన సురేష్ యాదవ్, జలేంద్ర చారి, యూత్ నాయకులు రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ



టేకుమట్ల నవంబర్ 2 (మన మీ వార్త)

టేకుమట్ల గ్రామానికి చెందిన సంపంగి బక్కయ్య ఇటీవల పాము కాటుతో మరణించగా 9వ రోజు కాగా వారి గృహానికి చేరుకొని బక్కయ్య చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి మనోధైర్యాన్ని కల్పించి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టేకుమట్ల మండల కోశాధికారి మచ్చ పైడి మాదిగ, ఎంఎస్పి మండల కార్యదర్శి మచ్చ రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఏరివెల్లి రాజేష్ మాదిగ,కొల్గురి సదానందం, కోండ్ర ప్రశాంత్ మాదిగ కోండ్ర రాజేందర్ మాదిగ, మచ్చ రాకేష్ మాదిగ, సంపంగి పెద్ద సమ్మయ్య, రాయమల్లు, చిన్న సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నాచారం మెయిన్ రోడ్డులో యూటర్న్ సమస్యకు త్వరలో పరిష్కారం

- ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేస్తామని అధికారుల హామీ

నాచారం, నవంబర్ 2 (మన మీ వార్త):





నాచారం మెయిన్ రోడ్డులో యూటర్న్ మూసివేత కారణంగా వాహనదారులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన ప్రాంతంలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేస్తామని సంబంధిత శాఖల అధికారులు హామీ ఇచ్చారు.నాచారం మెయిన్ రోడ్డు నుంచి రాఘవేంద్ర నగర్, శ్రీ రాఘవేంద్ర నగర్, న్యూ రాఘవేంద్ర నగర్, శాంతి గార్డెన్స్, రైతు బజార్, ఇందిరానగర్, అన్నపూర్ణ కాలనీలతో పాటు పలు పాఠశాలలకు వెళ్లే వాహనదారులు యూటర్న్ మూసివేతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తెలిపారు. యూటర్న్ అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు ఈఎస్ఐ ఆసుపత్రి వరకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వాల్యూ జోన్ వద్ద రాంగ్ రూట్లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని, ట్రాఫిక్ చలాన్ల రూపంలో జరిమానాలు చెల్లించాల్సి వస్తోందని వివరించారు.

ఈ సమస్య పరిష్కారం కోసం గత రెండేళ్లుగా పలుమార్లు సంబంధిత అధికారులను కలిసి వినతులు అందజేసినట్లు తెలిపారు. గతంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినప్పటికీ పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో సోమవారం రోడ్ సేఫ్టీ, ఇంజనీరింగ్, ట్రాఫిక్ పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా నాచారం మెయిన్ రోడ్డులో యూటర్న్ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరలోనే ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసి వాహనదారుల ఇబ్బందులను తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు సాయిజెన్ శేఖర్ వెల్లడించారు.ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు వల్ల వాహనదారులకు ప్రయాణం సులభతరం కావడంతో పాటు రాంగ్ రూట్ ప్రయాణాలు, రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, రోడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, ఏఎంఐ ఉపాసన, ఉప్పల్ ఏహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సౌశిల్య, మల్కాజిగిరి రోడ్ సేఫ్టీ వింగ్ ఎస్ఐలు సాయన్న, జగన్, రోడ్ సేఫ్టీ సిబ్బంది, నాచారం సర్కిల్ డీఈ పృథ్వీ, ఏఈ సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లర కాంటాలతో పత్తి రైతులను దోచుకుంటున్న మధ్య దళారులు

- ఏనుమాముల మార్కెట్‌లో సమస్యలపై ఏఐకేఎఫ్ ప్రతినిధి బృందం సందర్శన

వరంగల్ నవంబర్ 2 (మల్లేష్ వార్త ప్రతినిధి) :





గ్రామాల్లో చిల్లర కాంటాలను అరికట్టి, పత్తి మార్కెట్లో ధరల వ్యత్యాసాన్ని తగ్గించి రైతులకు న్యాయం చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. పత్తి క్వింటాకు రూ. 12 వేల కనీస మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతినిధి బృందం వరంగల్‌లోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించింది. మార్కెట్‌కు పత్తిని తీసుకువచ్చిన రైతులతో మాట్లాడి ధరలు, ఎదురవుతున్న ఇబ్బందులు, జరుగుతున్న మోసాల గురించి వివరాలు అడిగి తెలుసుకుంది.

ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ, అంతర్జాతీయంగా పత్తి సాగు విస్తీర్ణం, దిగుబడి తగ్గిన నేపథ్యంలో పత్తికి మంచి డిమాండ్ ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో సుమారు 49 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినప్పటికీ, ఎకరానికి నాలుగు నుంచి ఐదు క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పత్తి ధరలు పెరగాల్సి ఉండగా, తగ్గిస్తూ కొనుగోలు చేయడం రైతులకు తీవ్ర అన్యాయమన్నారు.

ఆసియాలోనే రెండో అతిపెద్ద మార్కెట్‌గా పేరొందిన ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఈ సీజన్‌లో ఇతర మార్కెట్లతో పోలిస్తే ఒక్కసారి కూడా ఆశించిన స్థాయిలో అధిక ధరలు పలకకపోవడం దారుణమన్నారు. జెండా పాట పేరుతో కొద్దిమంది రైతుల పత్తికి మాత్రమే అధిక ధర వర్తింపజేసి, మిగతా రైతుల పత్తిని క్వింటాకు రూ. 500 నుంచి రూ. 600 వరకు తక్కువ ధరకు కొనుగోలు చేయడం అన్యాయమని విమర్శించారు. జెండా పాట ధరను రైతులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.మార్కెట్‌లో నాలుగు వే బ్రిడ్జి కాంటాలు ఉన్నప్పటికీ అవి పనిచేయకపోవడం సిగ్గుచేటన్నారు. లూజుగా వాహనాల్లో తీసుకువచ్చే పత్తికి మార్కెట్‌లో ధర నిర్ణయించినప్పటికీ, బయట తూకం వేసి మార్కెట్‌లో ధర తగ్గించడం రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు.

గ్రామాల్లో మధ్య దళారులు రైతులను మభ్యపెట్టి మార్కెట్ ధర కంటే తక్కువకు పత్తిని కొనుగోలు చేస్తున్నారని, తూకాల్లో మోసాలకు పాల్పడుతూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారాలను మార్కెట్ యంత్రాంగం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఇప్పటికైనా గ్రామాల్లో చిల్లర కాంటాలను అరికట్టి, ధరల వ్యత్యాసాన్ని తొలగించాలని, జెండా పాట ధరను రైతులందరికీ వర్తింపజేయాలని కోరారు. మార్కెట్‌లో రైతులు, కార్మికులకు నాణ్యమైన ఉచిత భోజనం అందించడంతో పాటు మార్కెట్‌లో కనీస సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి క్వింటాకు రూ. 12 వేల కనీస మద్దతు ధర నిర్ణయించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం మార్కెట్ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మార్కెట్ చైర్మన్ శ్రీమతి ఎర్ర ప్రియాంక, మార్కెట్ కార్యదర్శి నిషాని శ్రీనివాస్‌లకు అందజేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరగా, వారు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. రెడ్డి హంసారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి కుసుంబ బాబురావు, రాష్ట్ర నాయకులు సింగతి సాంబయ్య, జిల్లా కోశాధికారి సింగతి మల్లికార్జున్, ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు వంగల రాగసుధ, గడ్డం నాగార్జున, ముక్కెర రామస్వామి, మాస్ సావిత్రి, మాలి ప్రభాకర్, అప్పనపురి నర్సయ్య, ఏఐకేఎఫ్ జిల్లా నాయకులు ఐతం నాగేష్, మహమ్మద్ ఉస్మాన్, మంద భద్రయ్య, గోనె రామచంద్రు తదితరులు, రైతులు పాల్గొన్నారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై అఖిలపక్ష సమావేశానికి టీపీసీసీ చీఫ్ ఆదేశం

జవహర్ నగర్ , నవంబర్ 02: (వార్త ప్రతినిధి)



జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు అన్ని రాజకీయ పార్టీలతో కలిసి అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశించారు.

ఢిల్లీ పర్యటనలో ఉన్న టీపీసీసీ చీఫ్ ను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వజ్రేష్ యాదవ్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సమస్య పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని, అన్ని వర్గాలను భాగస్వాములను చేస్తూ ముందుకు సాగాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

రేపే అఖిలపక్ష సమావేశం – తోటకూర వజ్రేష్ యాదవ్

టీపీసీసీ అధ్యక్షుల ఆదేశాల మేరకు రేపు మంగళవారం, నవంబర్ 03 ఉదయం 11:00 గంటలకు నాగారంలోని ఎం వై ఆర్ ఫంక్షన్ హాల్‌లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రకటించారు.

ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు,



ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, డంపింగ్ యార్డ్ బాధితులు మరియు పోరాట నాయకులు పెద్ద ఎత్తున హాజరై తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేశ్ గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

బాలరాజు యాదవ్ మృతికి కారణమైన దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలి

- ఖానాపురం మండల యాదవ సంఘం డిమాండ్

ఖానాపురం, నవంబర్ 2(మల్లేష్ వార్తప్రతినిధి) :



ఖానాపురం మండలం మనుబోతులగడ్డ గ్రామానికి చెందిన మంచే బాలరాజు యాదవ్ మృతి చెందడం పట్ల ఖానాపురం మండల యాదవ సంఘం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో యాదవ సంఘం కమిటీ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి యాదవ సంఘం అండగా ఉంటుందని సంఘం అధ్యక్షుడు పులిగిల్ల యాదగిరి యాదవ్ తెలిపారు. బాలరాజు యాదవ్ మృతికి కారణమైన దోషులను వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఖానాపురం మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత అశోక్ యాదవ్, మాజీ సర్పంచ్ బుస రమ అశోక్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఊడ్గుల రాజు యాదవ్, కోడి మల్లేష్ యాదవ్, కోశాధికారి మీరాల సోమయ్య యాదవ్, వంగ సుమన్ యాదవ్, వల్లపు ఐలోని యాదవ్, వరదయ్య యాదవ్, కొండ శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అడవి పందుల దాడి.. మూడున్నర ఎకరాల పత్తి పంట ధ్వంసం

- చేతికొచ్చిన పంట నేలపాలు.. రైతుకు తీవ్ర నష్టం

కాసిపేట, నవంబర్ 2:(మన మీ వార్త మండల ప్రతినిధి)





కాసిపేట మండలం సోనాపూర్ గ్రామంలో అడవి పందుల దాడితో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన కోవ దౌలత్‌రావు సర్వే నంబర్ 47లో సాగు చేస్తున్న మూడున్నర ఎకరాల పత్తి పంటను ఆదివారం రాత్రి అడవి పందులు పూర్తిగా ధ్వంసం చేశాయి. చేతికొచ్చిన పంట నాశనం కావడంతో బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అడవి పందుల వల్ల పంట నష్టం జరిగితే అటవీ అధికారులు బాధ్యత వహించకపోవడం సరికాదని రైతు వాపోయారు. పంట నష్టానికి పరిహారం చెల్లించాలని, రెవెన్యూ, వ్యవసాయ, అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన



నెల్లికుదురు నవంబర్ 2 (మీ వార్త ప్రతినిధి) :

నెల్లికుదురు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమం చేపట్టారు. భోజన విరామ సమయంలోఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ మోడల్ స్కూల్ పిలుపు మేరకు రెండో దశ నిరసన కార్యక్రమంలో భాగంగా మండల రెవెన్యూ అధికారికి ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తమ ప్రధాన డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 010 పద్ధతిలో వేతనాలు చెల్లించాలని, ఇంటర్ వరకు బోధిస్తున్న పీజీటీ ఉపాధ్యాయులకు జేఎల్ స్కేల్ వర్తింపజేయాలని, 317 జీవోను వెంటనే అమలు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, దీర్ఘకాలంగా పాఠశాలల్లో తాత్కాలికంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

హెచ్‌బీటీలకు నెలకు రూ.35 వేల వేతనం ప్రకటించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. మోడల్ స్కూల్‌లను వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 4, 5 తేదీల్లో జిల్లా స్థాయిలో వినతిపత్రాలు సమర్పించాలని, నవంబర్ 17న రాష్ట్రస్థాయిలో ధర్నా కార్యక్రమాలు నిర్వహించాలని జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూపాలపల్లి నియోజకవర్గ పట్టభద్రులు తప్పనిసరిగా Form -18 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలి

- అజయ్ రెడ్డి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు

మొగుళ్ళపల్లి(మీవార్త ప్రతినిధిమనోజ్), నవంబర్2:



భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు Form -18 ద్వారా గ్రాడ్యుయేట్ ఓటర్‌గా తమ పేరును నమోదు చేసుకుని జరగబోయే మీజ ఎలెక్షన్ లో ఓటు వేయడానికి అర్హత పొందాలని యూత్ కాంగ్రెస్ నాయకుడు అజయ్ రెడ్డి కోరారు. నవంబర్ 2023 లోపు గ్రాడ్యుయేషన్ పూర్తి అయినవారు అందరూ ఆలస్యం చేయకుండా తమ దరఖాస్తులను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించాలి లేదా ఆన్లైన్ లో ఫారం 18 సబ్మిట్ చేయాలని ఆయన సూచించారు. ఇందుకు కావలసిన సర్టిఫికెట్లు గ్రాడ్యుయేషన్/డిగ్రీ సర్టిఫికెట్,ఫోటో,ఆధార్ కార్డు,ఓటరు ఐడీ ,మొబైల్ నెంబర్ ఇంతకముందు గ్రాడ్యుయేట్ ఓటరు అయినా కూడా మళ్ళీ అప్లై చేసుకోవాలి. సంబంధిత అధికారిక నోటిఫికేషన్‌ను పరిశీలించి, 2026 నవంబర్ 6 లోపు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇందుకు సంబందించిన అప్లికేషన్ సబ్మిట్ చేయడంలో ఏదైనా సహాయం కావాలంటే మా ఆఫీస్ ఫోన్ నంబర్లకు (9642806316 , 9133418391) సంప్రదించండి అని తెలిపారు.

కదం తొక్కిన కేబుల్ టీవీ జర్నలిస్టులు

- ఐఅండ్‌పీఆర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా..
- కమిషనర్ ఛాంబర్ ముందు బైఠాయింపు
- అక్రెడిటేషన్లు వెంటనే మంజూరు చేయాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

హైదరాబాద్, నవంబర్ 2 (మల్లేష్ మీవార్త ప్రతినిధి) :



కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షపూరిత వైఖరిని నిరసిస్తూ జర్నలిస్టులు కదం తొక్కారు. తెలంగాణ కేబుల్ ఛానల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన కేబుల్ టీవీ జర్నలిస్టులు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార భవన్ (ఐఅండ్‌పీఆర్ కమిషనర్ కార్యాలయం) ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌ను కలవాలని పట్టుబడుతూ కార్యాలయంలోకి వెళ్లి ఆయన ఛాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు.ఆందోళనకారులను పోలీసులు బలవంతంగా బయటకు తరలించారు.ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, కేబుల్ ఛానళ్ల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న అనుచిత వైఖరిని తీవ్రంగా ఖండించారు. తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వార్తా సమాచారాన్ని అందిస్తున్న కేబుల్ ఛానళ్లకు ఐపీ ఛానళ్ల పేరుతో అక్రెడిటేషన్లు నిరాకరించడం అన్యాయమని మండిపడ్డారు.చిన్న పత్రికలు, కేబుల్ ఛానళ్ల సంఖ్యను తగ్గించాలనే కుట్రలో భాగంగానే ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) నెట్‌వర్క్ ద్వారా ప్రసారాలు చేస్తున్నాయనే సాకుతో అనేక ఛానళ్లకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. అక్రెడిటేషన్ల జారీలో అనేక అవకతవకలు జరిగాయని, లక్షల రూపాయల పెట్టుబడులతో నిజాయితీగా ఛానళ్లను నిర్వహిస్తున్న వారికి కార్డులు ఇవ్వకుండా అనర్హులకు మంజూరు చేశారని విమర్శించారు.

గతంలో కేబుల్ ఛానళ్లకు జిల్లాకు నాలుగు, రాష్ట్ర స్థాయిలో 12 అక్రెడిటేషన్ కార్డులు ఉండేవని, ప్రస్తుతం వాటిని సగానికి తగ్గించారని సోమయ్య తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనలు, సబ్సిడీలు లేకపోవడంతో పాటు అక్రెడిటేషన్ కార్డులు కూడా అందక అనేక కేబుల్ ఛానళ్లు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిజం వృత్తిపై ఆధారపడి ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న వేలాది మంది జర్నలిస్టులను ప్రభుత్వం రోడ్డున పడేస్తోందని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు 44 వేలకుపైగా అక్రెడిటేషన్లు ఇస్తున్నామని ప్రకటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఇప్పటివరకు ఎన్ని కార్డులు మంజూరు చేశారు? ఎవరికి ఇచ్చారు? కేబుల్ ఛానళ్లకు



ఎన్ని కేటాయించారు? అనే వివరాలను వెల్లడించాలని సోమయ్య డిమాండ్ చేశారు.ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న అన్ని కేబుల్ ఛానళ్లకు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా న్యాయబద్ధంగా అక్రెడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో చిన్న పత్రికలు, కేబుల్ ఛానళ్ల పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూడటం సరికాదన్నారు. ఐపీ ఛానళ్ల పేరుతో కేబుల్ ఛానళ్లను మూసివేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకుని, అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నాలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, బి.మల్లేష్ గౌడ్ ,యర్రమిల్లి రామారావు,టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్, టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్ ఎం. రవికుమార్, గద్వాల జిల్లా అధ్యక్షుడు గిరిబాబు, కేబుల్ ఛానళ్ల జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా పాదయాత్రకు హెచ్‌ఎంటీ నగర్ డివిజన్ నుంచి భారీగా తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు



- పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తా కార్యక్రమానికి హాజరు

నాచారం, నవంబర్ 2 (మన మీ వార్త):

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేపట్టిన చలో బషీర్‌బాగ్ చౌరస్తా పాదయాత్ర కార్యక్రమానికి మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో హెచ్‌ఎంటీ నగర్ డివిజన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన



కార్యక్రమంలో పాల్గొని పాదయాత్రకు తమ మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్, ఈవీఎంలపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు, వారు కోరుకున్న బ్యాలెట్ విధానంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు



చంద్రమౌళి, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ యోగేశ్వర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, హన్మంత్ బిరాదర్, గందమల గోపి, రాజిరెడ్డి, సురేందర్ స్వామి, శేఖర్ గుప్తా, వేణుగోపాల్, పోతగాని విజయ గోపాల్ గౌడ్, మంజులవాణి, పార్వతి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

ఢిల్లీ వేదికగా ప్రజాస్వామ్య పరిరక్షణకు 'ఓటు బచావో -- దేశ్ బచావో' మహా మార్చ్.



- జగదీశ్వర్ గౌడ్ నాయకత్వంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి భారీగా తరలివెళ్లిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ శ్రేణులు.

మియాపూర్ నవంబర్ 02 మన మీ వార్త:

ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, భారత రాజ్యాంగ స్ఫూర్తి సంరక్షణ, ప్రతి పౌరుడి ఓటు హక్కుకు భద్రత కల్పించాలనే లక్ష్యంతో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'చలో ఢిల్లీ -- ఓటు బచావో, దేశ్ బచావో' జాతీయ ఉద్యమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నవంబర్ 1న న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో నిర్వహించిన మహా మార్చ్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ వి. జగదీశ్వర్ గౌడ్ నాయకత్వంలో మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు. తెలంగాణ భవన్ నుంచి రాంలీలా మైదానం వరకు సాగిన మహా మార్చ్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్న వారు ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ, తెలంగాణ కాంగ్రెస్ ప్రముఖులు, ఇండియా కూటమి నాయకులు పాల్గొని ఓటు హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ విలువల సంరక్షణపై తమ గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యులు, వేం నరేందర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇడుపుగంటి సుబ్బారావు, ఖమ్మం జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు తుళ్లూరు బ్రహ్మయ్య, డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, కూన శ్రీశైలం, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్‌లను యలమంచి ఉదయ్ కిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీ వి. జగదీశ్వర్ గౌడ్



మాట్లాడుతూ.. ఓటు హక్కు అనేది ప్రజల గొంతుక, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉండాలని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని తెలిపారు.

యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం కావాలంటే ప్రతి పౌరుడి ఓటు హక్కుకు సంపూర్ణ గౌరవం, రాజ్యాంగ విలువలకు రక్షణ ఉండాలని అన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జాతీయ ఉద్యమంలో భాగస్వామ్యం కావడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. చలో ఢిల్లీ -- ఓటు బచావో, దేశ్ బచావో ఉద్యమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నేతలు, పలువురు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యశ్వంత్ మృతి

-హైదరాబాద్ లోని గాంధీ హాస్పిటల్ వద్ద పలువురు ప్రముఖుల పరామర్శ

మొగుళ్ళపల్లి,(మీవార్త ప్రతినిధి మనోజ్)నవంబర్ 2 :

తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, కొర్కిశాల మాజీ సర్పంచ్ దానవేణి రాములు–అఖిల దంపతుల కుమారుడు యశ్వంత్ ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ రైతు విమోచన కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్ రావు (నవత వెంకన్న) సోమవారం హైద్రాబాదులోని గాంధీ హాస్పిటల్ కి వెళ్లి దానవేణి రాములును, కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. తన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని నవత వెంకన్న రాములుకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా నవత వెంకన్న మాట్లాడారు. యశ్వంత్



చదువుల్లో రాణిస్తూ..హైద్రాబాద్ లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ లో చేరి..మంచి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ..కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి, తోటి స్నేహితులకు, చదువు నేర్పిన గురువులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తున్న క్రమంలో..ఆయన రోడ్డు ప్రమాదంలో అకాలంగా మరణించడం బాధాకరమని, ఆ కుటుంబానికి తీరని లోటని తెలిపారు. మృతి చెందిన యశ్వంత్ పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయనకు స్వర్గలోక ప్రాప్తిరస్తు కలగాలని నవత వెంకన్న ఆకాంక్షించారు. అదేవిధంగా తొలి శాసనసభాపతి, ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేష్ యాదవ్, పర్లపల్లి సర్పంచ్ జోరుక సదయ్య, మొట్లపల్లి సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి, మొగుళ్లపల్లి మండలంలోని ప్రముఖులు హైద్రాబాదులోని గాంధీ హాస్పిటల్ కు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దానవేణి రాములును, కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

మాధవనగర్ రైల్వే బ్రిడ్జి పనుల జాప్యంపై అఖిలపక్షం పోరుబాట

(మన మీ వార్త న్యూస్) : నవంబర్ 02, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై అఖిలపక్షం ఉద్యమ కార్యాచరణకు సిద్ధమైంది. నిజామాబాద్ జిల్లా డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశానికి ఫోరం చైర్మన్ బొబ్బిలి నర్సయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి 18 రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై బ్రిడ్జి నిర్మాణ పనుల జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాధవనగర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడంలో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని అన్ని పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశం నిర్ణయించింది. ఉద్యమంలో భాగంగా తొలుత జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయాలని, అనంతరం నిజామాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యేలందరికీ మెమోరాండాలు సమర్పించాలని నిర్ణయించారు. సమస్య పరిష్కారం కాకపోతే దీపావళి పండుగ తర్వాత ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ధర్నాలు,ఇళ్ల ముట్టడి కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు. అవసరమైతే నిజామాబాద్ నగర బంద్‌కు పిలుపునిచ్చి ఉద్యమాన్ని మరింత



ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.మాధవనగర్ రైల్వే బ్రిడ్జి సమస్య కేవలం ఒక ప్రాంతానికి సంబంధించినది కాదని, నిజామాబాద్ నగర అభివృద్ధి,ప్రజల రవాణా సౌకర్యాలకు సంబంధించిన కీలక సమస్య అని నాయకులు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యమాల స్థాయిని మించిన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా ముందుకు వస్తాయని ప్రతినిధులు ప్రకటించారు. పార్టీలకు అతీతంగా ప్రజా సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఐక్యంగా పోరాడాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో బిజెపి



ప్రధాన జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు,ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా అధ్యక్షులు కె. మధు, బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సబ్బని లత,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింహులు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆకుల పాపన్న, ఆర్ఎస్పీ నాయకులు కటారి రాములు, బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధి రాములు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎనగందుల మురళి, జర్నలిస్టు యూనియన్ నాయకులు నర్సింహులు, గంగాదాస్,ఇతర ప్రజాసంఘాలు,కార్మిక సంఘాలు,రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పాల్గొని ప్రసంగించారు.

బాలకృష్ణ నగర్ కాలనీల అభివృద్ధికి మరో ముందడుగు





- రూ.14 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం.. ప్రారంభించిన ఆకారపు అరుణ్ పటేల్

- రోడ్ల మంజూరుకు కృషి చేసిన మందుముల పరమేశ్వర్ రెడ్డికి కాలనీవాసుల కృతజ్ఞతలు

రామంతాపూర్, నవంబర్ 2 (మన మీ వార్త):

వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బాలకృష్ణ నగర్ కాలనీల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. బాలకృష్ణ నగర్ ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3, సబీరా కాలనీ, కురుమ నగర్ ప్రాంతాల్లో సుమారు రూ.14 కోట్ల వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకుడు ఆకారపు అరుణ్ పటేల్ ప్రారంభించారు.గతంలో నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా ఆయా కాలనీల్లో పర్యటించిన ఆకారపు అరుణ్ పటేల్ స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా రోడ్ల దుస్థితిని పరిశీలించి, కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సంబంధిత అధికారులతో చర్చించి రోడ్ల మంజూరుకు ప్రత్యేకంగా కృషి చేశారు.ఆయన కృషి ఫలితంగా సుమారు రూ.14 కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేసిన మందుముల పరమేశ్వర్ రెడ్డికి కాలనీ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఆకారపు అరుణ్ పటేల్ పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులకు సహకరించిన నాయకులు, అధికారులతో పాటు విజ్ఞప్తులు చేసిన కాలనీవాసులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు నామ్ రాజ్ రెడ్డి, బాలకృష్ణ నగర్ అధ్యక్షుడు తిక్కరెడ్డి వేణుగోపాల్ చారి, కాసిమ్ గౌడ్, సబీరా కాలనీ అధ్యక్షుడు మహమ్మద్ అశ్వక్, కాలనీవాసులు స్వామి, నాగరాజు, బ్రహ్మయ్య, అరుణ్, సాయి, నరసింహ, రఘు, సాయి, నాగమల్లయ్య, కిషోర్, భాను, నవీన్, పవన్, భాష, నాగేష్, బాలాజీ చారి, స్రవంతి, నాగేష్, రాము, శిమ్ము తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌వాసికి డాక్టరేట్..

- AcSIR నుంచి పీహెచ్‌డీ పొందిన యెదులాపురం

రంజిత్ కుమార్

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి నవంబర్ 02

ఎ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు యెదులాపురం రామబ్రహ్మం కుమారుడు యెదులాపురం రంజిత్ కుమార్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రతిష్ఠాత్మక డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టాను అందుకున్నారు. పరిశోధనా సంస్థల విభాగంలో ఎన్ఐఆర్ఎఫ్ జాతీయ ర్యాంకింగ్స్‌లో 9వ స్థానంలో నిలిచిన 'అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్' సంస్థ నుంచి ఆయన ఈ డిగ్రీని పొందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రముఖ జాతీయ పరిశోధనా సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ సాధించి రంజిత్ కుమార్ తన డాక్టరల్ తే పరిశోధనను పూర్తి చేశారు. ఆయన ప్రధానంగా నానోస్ట్రక్చర్డ్ ఐరన్ ఆక్సైడ్లు, ఎంట్రోపీ-ఇంజినీర్డ్ స్పినెల్ ఫెర్రైట్ల తయారీ-విశ్లేషణతో పాటు అయస్కాంత, శక్తి నిల్వ అనువర్తనాలపై విశేష పరిశోధనలు జరిపారు.



ఈ పరిశోధనల ఫలితంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పీర్-రివ్యూడ్ జర్నల్స్‌లో రంజిత్ కుమార్ రాసిన 17 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. చిన్నతనం నుంచే చదువులో ప్రతిభ కనబరిచిన ఆయన, ఉన్నత పరిశోధన రంగంలో ప్రతిష్ఠాత్మక పీహెచ్‌డీ సాధించడంపై కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రంజిత్ కుమార్ సాధించిన ఈ విద్యా విజయం హుజూరాబాద్ ప్రాంతానికి ఎంతో గర్వకారణమని స్థానికులు కొనియాడారు.

ప్రాచీన ప్రసిద్ధిగాంచిన శిల్పాలను సందర్శించిన వెల్దుర్తి పీఎం శ్రీ పాఠశాల విద్యార్థులు

- చదువుతోపాటు ప్రాచీన శిల్ప సంపదలు ప్రత్యక్షంగా విద్యార్థులకు వివరించిన ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య

నవంబర్ 2 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి :





విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు మన చుట్టూ ఉన్న చరిత్రక సాంస్కృతిక వారసత్వ సంపద ప్రత్యక్షంగా పరిచయం విద్యార్థులకు చేయాలని ఉద్దేశంతో సోమవారం నాడు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నువ్వు చదువుతున్న ఏడవ తరగతి విద్యార్థి విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రమైన వెల్దుర్తి లోని కాకతీయుల నాటి అద్భుత శిల్పకళా సంపద సందర్శనార్థం విద్యార్థులకు అక్కడ శిల్పాల అందాలను వాటిపై చెక్కిన అద్భుతమైన కళా నైపుణ్యం సృజనాత్మక సాంస్కృతిక సంప్రదాయాలను పుస్తకాలు చదివిన విషయాలకంటే ప్రత్యక్షంగా చూసి విద్యార్థులు ఎంతో విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో భాష ఉపాధ్యాయులు అర్చన విజయ్ మోహన్ ఖదీర్ భాష ఉపాధ్యాయుల వెంకటస్వామి రాము విద్యార్థులకు శిల్పకళ విశేషాలను వివరించారు ఇలాంటి క్షేత్రస్థాయి సంఘర్షణలను విద్యార్థుల్లో చరిత్రపై ఆసక్తిని కలల పట్ల అభిరుచిని మన వారసత్వ సంపదన పట్ల గౌరవాన్ని ఇస్తామని ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య ఉపాధ్యాయులు తెలిపారు.

ప్రజాసేవకు గుర్తింపుగా కొంగరా రామచంద్రకు జిల్లా స్థాయి బాధ్యతలు

- మేడ్చల్ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా నియామకం...

చిలుకా నగర్, నవంబర్ 2 (మన మీ వార్త)



చిల్కనగర్‌కు చెందిన కొంగరా రామచంద్రను మేడ్చల్ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. సామాజిక, సేవా కార్యక్రమాల్లో ఆయన చేసిన సేవలను గుర్తించిన పార్టీ ఈ బాధ్యతలను అప్పగించింది.
చిల్కనగర్ మాలా సంక్షేమ సంఘం అభివృద్ధికి ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా రామచంద్ర కీలకంగా పనిచేశారు. బ్లడ్ డోనర్స్ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది నుంచి రక్తాన్ని సేకరించి గాంధీ ఆసుపత్రికి అందించారు. చిల్కనగర్ శివాలయ పునర్నిర్మాణంలోనూ ఆయన సహకరించారు.

ప్రజాసేవే తన లక్ష్యమని, పదవులతో సంబంధం లేకుండా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని రామచంద్ర తెలిపారు.

ఈ సందర్భంగా చిల్కనగర్ మాలా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మంచినీళ్ల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు కొండ్రా రాములు, దేవుల పురుషోత్తం, పదిగాం రామ్ నర్సయ్య, రామకృష్ణ, బీజేపీ సీనియర్ నాయకుడు సంగిశెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో భూభారతి ల సర్వే అవగాహన సదస్సు నిర్వహించిన రెవెన్యూ అధికారులు

నవంబర్ 2 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి





వెల్దుర్తి మండలం నెల్లూరు గ్రామపంచాయతీ లో భూభారతి ఆర్ సర్వే అవగాహన సదస్సు నిర్వహించిన రెవెన్యూ అధికారులు శనివారం నాడు నెల్లూరు పెద్దాపూర్ రైతులతో గ్రామస్తులతో ప్రభుత్వం నిర్వహించే భూభారతి రిసర్వే గురించి అవగాహన సదస్సు నిర్వహించారు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఆర్డీవో భవ్య వెల్దుర్తి తాసిల్దార్ లక్ష్మి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గురించి రైతులకు తెలిపారు రిజర్వే విధానాన్ని చాలను ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు నిర్ణయించడమే ప్రభుత్వ లక్ష్యమని రైతుల సందేహాలకు అధికారులు స్పష్టమైన సమాధానం ఇచ్చారు రైతులందరూ సహకరించి భూభారతి ఆర్ సర్వే కు హాజరుకావాలని వారు సూచించారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా, నవంబర్ 02(మీ వార్త)



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పురోగతి, పెండింగ్ ఫారం- 6,7,8 దరఖాస్తుల పరిష్కారం, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, తదితర అధికారులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఫారం-6, 7, 8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, ఎస్ఐఆర్‌లో తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనర్హుల విషయంలో తగిన ఆధారాలతో రికార్డులు భద్రపరచాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్‌లో దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను మొత్తం పారదర్శకంగా పూర్తి చేస్తామని వివరించారు.ఈ సమావేశంలో ఆర్డీవో దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా, నవంబర్02(మీ వార్త)



ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవ రావు, రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దండారి దర్బార్‌కు చింతగూడ దండారీ సంప్రదాయ పూజలు

కాసిపేట, నవంబర్ 2:(మన మీ వార్త మండల ప్రతినిధి)







సల్పలవాగు లో ఈ నెల 4న జరగనున్న దండారి దర్బార్ ఉత్సవాల్లో భాగంగా చింతగూడ గ్రామ దండారీ వెంకటాద్రి బలి దేవాలయంలో నైవేద్యం సమర్పించి, దేవుని జెండా పూజ నిర్వహించారు. ఆదివాసీ సంప్రదాయ డోలు వాయిద్యాలతో ఆలయానికి చేరుకుని వారి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.

ఈ నెల 3స సాయంత్రం మండలంలోని వివిధ గ్రామాల దండారీలు సల్పలవాగు వెంకటాద్రి బలి దేవాలయానికి చేరుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలి

- కాసిపేట-1 గనిని సందర్శించిన జనరల్ మేనేజర్

కాసిపేట, నవంబర్ 2:(మన మీ వార్త మండల ప్రతినిధి)



మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ కాసిపేట-1 ఇంక్లైన్ గనిని సందర్శించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఉత్పత్తిలో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.

గనిలోని పనులను, యంత్రాల పనితీరును పరిశీలించి వాటిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. రక్షణ చర్యలను సమీక్షిస్తూ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, రక్షణతో పాటు ఉత్పత్తికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళ్యాణిఖని ఏజెంట్ అబ్దుల్ ఖాదీర్, ఐఈడీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కిరణ్ కుమార్, మేనేజర్ సతీష్, రక్షణాధికారి సురేష్, సర్వేయర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ మరో ఇద్దరికి చూపునిచ్చిన వజ్రమ్మ

- నేత్రదానం చేసి ఆదర్శంగా నిలిచిన కుటుంబ సభ్యులు

కాసిపేట, నవంబర్ 2: (మన మీ వార్త మండల ప్రతినిధి)



కాసిపేట మండలం దేవాపూర్ గ్రామానికి చెందిన ఆడెపు వజ్రమ్మ (65) అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబంలో విషాదం నెలకొన్నప్పటికీ, ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. జనహిత సేవా సమితి ప్రతినిధి డోలి సుకుమార్, బంధువుల చొరవతో భర్త ఉప్పలయ్య, పిల్లలు నేత్రదానానికి అంగీకరించారు.ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ ప్రతినిధి ప్రదీప్ వజ్రమ్మ కార్నియాలను సేకరించారు. ఆమె నేత్రదానం ద్వారా ఇద్దరికి చూపు లభించనుంది. కుటుంబ సభ్యుల మానవతా నిర్ణయాన్ని పలువురు అభినందించారు. అనంతరం ఐ బ్యాంక్ తరపున కుటుంబ సభ్యులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ..



భూపాలపల్లి నవంబర్ 02 (మీవార్త)

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మాదిగ హక్కుల దండోరా భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎన్ హెచ్ ఎం. ఉద్యోగులు చేస్తున్న సమ్మె 21 రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ హాజరై సంపూర్ణ మద్దతు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను 18 సంవత్సరాల నుండి ప్రభుత్వం శ్రమ దోపిడి దోచుకుంటుందని, వారి శ్రమకు తగ్గ వేతనం అందించాలని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేయాలని వారికీ స్టర్స్ ద్వారా నేరుగా వేతనాలు అందించాలని, మహిళ సిబ్బందికి 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలనీ, మరణించిన ఉద్యోగికి 20 లక్షల ఎక్స్ గేషియా, ప్రతి ఉద్యోగికి ఈఎస్ఐ/ ఈ హెచ్ ఎస్ .సౌకర్యలు కల్పిస్తూ,, పెండింగ్ లో ఉన్న 9 నెలల పిఆర్సి మరియు ఏరియర్స్ తక్షణమే విడుదల చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు మరియు మాదిగ హక్కుల దండోరా నాయకులు పొట్ట దుర్గయ్య మాదిగ, శ్యామ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు..

క్రాకర్స్ విక్రయదారులు నిబంధనలు పాటించాలి : సీపీ సాయిచైతన్య

(మన మీ వార్త న్యూస్) : నవంబర్ 02, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



క్రాకర్స్ విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. జిల్లా పాలిటెక్నిక్ క్రాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, హోలసేల్ షాపుల యాజమాన్యాలతో సీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సమావేశం నిర్వహించారు.

లైసెన్స్‌లు పొందిన తర్వాతే..

పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ బాణసంచా విక్రయాలు నిర్వహించే ప్రతి షాపు యాజమాన్యం ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సంబంధిత శాఖల నుంచి అవసరమైన లైసెన్సులు పొందిన తర్వాతే విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. షాపుల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాల్లో ఎక్కడా అలసత్వం ప్రదర్శించరాదని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయాలు నిర్వహించినా.. భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా సంబంధిత షాపు యాజమాన్యాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

తప్పనిసరిగా ఉండాల్సినవి..

లైసెన్స్ కాపీ దుకాణం ముందు కనిపించేలా ఉండాలన్నారు. రెండు అగ్నిమాపక యంత్రాలు, 2 ఇసుక బకెట్లు , 2 నీటి బకెట్లు ఉండాలని సూచించారు. దుకాణంలో పొగ తాగడం, అగ్గిపుల్ల, లైటర్ వెలిగించడం, వంట చేయడం పూర్తిగా నిషేధమని సీపీ స్పష్టం చేశారు. 18ఏళ్లలోపు పిల్లలకు బాణాసంచా అమ్మకూడదన్నారు. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు దుకాణం మూసివేయాలని..దుకాణం దగ్గర టపాసులు కాల్చి చూపించకూడదని పేర్కొన్నారు. ఏసీపీ ప్రకాష్, టౌన్ సీఐ సత్యనారాయణ,రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, నిజామాబాద్ టౌన్--1 ఎస్హెచ్వో శ్రీనివాస్, రెండోటౌన్ ఎస్సై యాదగిరి గౌడ్, మూడో టౌన్ ఎస్సై హరిబాబు, నాల్గో టౌన్ ఎస్సై--2 సాయన్న, ఐదోటౌన్ ఎస్సై సునీల్, పాలిటెక్నిక్ క్రాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పేట సంతోష్, సెక్రెటరీ పసుమర్తి ప్రవీణ్, క్యాషియర్ బొంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కునపాటి పద్మారావు మరణం - పార్థివ దేహ దానంతో చరిత్ర

- పద్మారావు మరణం బీఎస్పీ పార్టీకి తీరని లోటు-ఇబ్రహీం శేఖర్

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ నవంబర్ 02(మన మీ వార్త)







ఘట్కేసర్ మండల ప్రాంతానికి చెందిన బీఎస్పీ పార్టీ సీనియర్ నాయకులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కునపాటి పద్మారావు, ఆదివారం రోజున సాయంత్రం 4: గంటల సమయంలో (బ్రెయిన్ స్ట్రోక్) తో మేడిపల్లి శ్రీకర హాస్పిటల్ లో మరణించారు. ఆయన మరణ వార్తతో ఘట్కేసర్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పద్మారావు, జీవితాంతం పేద ప్రజల సేవలో, బీఎస్పీ పార్టీ బలోపేతానికి కృషి చేసిన గొప్ప నాయకుడు. ఎంతోమంది పేదలకు అండగా నిలిచారు.

ఆయన చివరి కోరిక - అందరికీ ఆదర్శం:

గత సంవత్సరం తన తల్లి మరణించినప్పుడు హిందూ సాంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు చేయడానికి లక్షల్లో ఖర్చు అయింది. ఆ ఖర్చును చూసి ఆయన చలించిపోయారు.

"ఒక పేదవాడు మరణిస్తే అంత్యక్రియలకు లక్షల్లో ఖర్చు వస్తుంది. చివరకు కాలిపోయిన శరీరం బూడిద అయిపోతుంది. అది ఎవరికీ ఉపయోగం ఉండదు. ఇది ఎంత వృధా ఖర్చు" అని ఆయన తన మిత్రులతో, కుల బాంధవులతో, కుటుంబ సభ్యులతో చర్చించారు.

అప్పుడే ఆయన ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. "నా మరణం ఒకవేళ జరిగితే, నా పార్థివ దేహాన్ని హిందూ సాంప్రదాయ ప్రకారం కాల్చివేయడం, పూడ్చిపెట్టడం నాకు ఇష్టం లేదు. నా శరీరం పై వైద్యం చదువుకునే విద్యార్థులు, సైంటిస్టులు, డాక్టర్లు చదువుకుని ప్రయోజనం పొందాలి. నా శరీరం వల్ల పది మంది డాక్టర్లు తయారైతే, వారు వేల మంది పేదల ప్రాణాలు కాపాడుతారు" అని తన చివరి కోరికగా గతంలోనే తెలిపారు.

కుటుంబ సభ్యుల గొప్ప నిర్ణయం:

ఆదివారం ఆయన మరణించిన తర్వాత కుటుంబ సభ్యులు ఆయన చివరి కోరికను కుల బాంధవులకు, మిత్రులకు, బౌద్ధులకు, బీఎస్పీ పార్టీ నాయకులకు తెలిపారు.

"నేను పేద దళిత వర్గంలో పుట్టాను. పుట్టినప్పుడు లక్షల్లో ఖర్చు, తల్లి మరణిస్తే లక్షల్లో ఖర్చు. శరీరం కాలిపోయే బూడిదలో ఇంత ఖర్చు చేయడం నాకు నచ్చలేదు. అందుకే నా పార్థివ దేహాన్ని డాక్టర్లకు ఉపయోగపడే విధంగా ఇవ్వండి. దీనికి ఎవరూ బాధపడవద్దు" అని ఆయన గతంలోనే చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు.

పద్మారావు గారి ఈ నిర్ణయం ఇప్పుడు ఘట్కేసర్ ప్రాంతంలోనే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఒక దళిత బహుజన నాయకుడు తన మరణంలో కూడా సమాజానికి ఉపయోగపడాలని కోరుకోవడం గొప్ప విషయమని బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్, పలువురు నాయకులు కొనియాడుతున్నారు.ఆయన పార్థివ దేహాన్ని ప్రభుత్వ వైద్య కళాశాలకు దానం చేయడానికి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీఎస్పీ పార్టీ అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్, ఉదయం హాస్పిటల్ కి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు రవీందర్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి శీలం అనిత రెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ వేముల బాలస్వామి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మల్లెపోగు విజయ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కొండా అప్పారావు, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుక్క దయానంద్, జిల్లా ఈసీ గ్యార గోవర్ధన్, సీనియర్ నాయకులు చిన్నింగళ్ళ కుమార్, సీనియర్ నాయకులు నల్ల ప్రభాకర్, సీనియర్ నాయకులు ఎర్రవల్లి మల్లేష్, సీనియర్ నాయకుడు చిర్యాల జంగయ్య, ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షులు మింద్రల నర్సింగ్ రావు, మేడ్చల్ అసెంబ్లీ కార్యదర్శి భాను గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు పారిశుద్ధ్యానికి ఆధునిక వాహనాలు.. పరిశుభ్రతకు కొత్త శకం!

- రూ.12 కోట్ల తోషిబా సీఎస్ఆర్ నిధులతో 10 స్వీపింగ్ మిషన్లు, 10 టిప్పర్ల కొనుగోలు

- తొలి విడత వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

- జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

పటాన్‌చెరు, నవంబర్ 02: మీ వార్త ప్రతినిధి:





పటాన్‌చెరు నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు ఆధునిక వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్ సర్కిళ్ల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా స్థానిక తోషిబా పరిశ్రమ అందించిన రూ.12 కోట్ల సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన అత్యాధునిక పారిశుద్ధ్య వాహనాల ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం మైత్రి మైదానంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్), తోషిబా పరిశ్రమ హెచ్ఆర్ డైరెక్టర్ మారు మోటోలతో కలిసి అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ తదితరులు తొలి విడతగా సమకూర్చిన ఐదు అత్యాధునిక స్వీపింగ్ మిషన్లు, ఐదు టిప్పర్లను జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఒక్కో డివిజన్‌కు స్వీపింగ్ మిషన్, టిప్పర్, జేసీబీ వాహనాలను సమకూర్చుతున్నట్లు తెలిపారు. బీహెచ్ఈఎల్ నుంచి ఇస్నాపూర్ చౌరస్తా వరకు జాతీయ రహదారిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక వాహనాన్ని సైతం కేటాయించినట్లు వెల్లడించారు.పరిసరాల పరిశుభ్రత కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా సహకరించాలని కోరారు. కాలనీల విస్తరణ, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అదనపు పారిశుద్ధ్య కార్మికులను తక్షణమే నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రూ.12 కోట్ల సీఎస్ఆర్ నిధులు అందించిన తోషిబా పరిశ్రమ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్, డిప్యూటీ కమిషనర్లు కావ్య, లలిత శ్రావణి, తోషిబా ప్రతినిధులు రామకృష్ణ, రాజా, మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ కార్పొరేటర్లు అంజయ్య, కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అగ్రకుల ఆధిపత్య పార్టీలకు చెక్ పెట్టాలి -- తీన్మార్ మల్లన్న

భూపాలపల్లి నవంబర్ 02 (మీవార్త)



తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, భూపాలపల్లి జిల్లా టీఆర్పీ అధ్యక్షుడు రవి పటేల్ ఉదయం పాదయాత్రకు ముందు సరదాగా చదరంగం (చెస్) ఆడారు.

ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. చదరంగం ఆటలో ప్రత్యర్థి వేసే ఎత్తులకు పైఎత్తులు వేస్తూ విజయం సాధించినట్లుగానే, రాజకీయాల్లో కూడా అగ్రకుల ఆధిపత్య పార్టీలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఐక్యంగా నిలబడి చెక్ పెట్టాలని పిలుపునిచ్చారు.

చదరంగం ఆటలో ప్రతి సైనికుడికి ప్రాధాన్యత ఉన్నట్లే, సామాజిక న్యాయం సాధించే పోరాటంలో ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బిడ్డ కీలకమని అన్నారు. కుల సంఘాల నాయకులను, ప్రజా సంఘాలను కలుపుకొని పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు.

రాష్ట్రంలో ప్రజలు రాజకీయ మార్పును కోరుకుంటున్నారని, ఇకపై మన ఓట్లు మనకే, మన సీట్లు మనకే అనే నినాదంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. మన రాజ్యాధికారం సాధించే వరకు పోరాటం ఆగకూడదని స్పష్టం చేశారు.

త్వరలోనే భూపాలపల్లి నియోజకవర్గంలో బీసీ రాజ్యాధికార పాదయాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలు, కుల సంఘాల నాయకులు, యువత, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు.

డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- పీసీసీ చీఫ్ ను కలిసిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ బృందం

జవహర్ నగర్, నవంబర్ 02: (వార్త ప్రతినిధి)

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, దశాబ్దాలుగా నరకయాతన అనుభవిస్తున్న స్థానిక ప్రజలకు విముక్తి కల్పించాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు.

ఢిల్లీలో ప్రత్యేక భేటీ:

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను వజ్రేష్ యాదవ్ తన బృందంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్య తీవ్రతను, స్థానికుల ఆవేదనను పూర్తి స్థాయిలో ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో ఏళ్లుగా హైదరాబాద్ నగరం నుంచి వచ్చే వేల టన్నుల చెత్తను జవహర్ నగర్ లో డంప్ చేయడం వల్ల పరిసర ప్రాంతాలు భరించలేని దుర్వాసనతో నిండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త కుప్పల నుంచి వెలువడే విషవాయువులు, లీచేట్ కారణంగా గాలి, భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని, దీంతో పరిసర కాలనీల్లోని ప్రజలు చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని వివరించారు.

మహిళలు, చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు:

ముఖ్యంగా జవహర్ నగర్, నాగారం, దమ్మాయిగూడ,



యాప్రాల్, కౌకూర్ పరిసర ప్రాంతాల్లో నివసించే మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని వజ్రేష్ యాదవ్ పీసీసీ చీఫ్ కు వివరించారు. ఈ సమస్య కేవలం ఒక ప్రాంతానికే పరిమితమైనది కాదని, ఇది ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భావితరాల భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన అంశమని స్పష్టం చేశారు.

టీపీసీసీ చీఫ్ సానుకూల స్పందన:

వజ్రేష్ యాదవ్ వినతికి సానుకూలంగా స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఈ సమస్య పరిష్కారానికి అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకుని అఖిలపక్ష సమావేశం నిర్వహించి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించినట్లు వజ్రేష్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, సంబంధిత శాఖల సమన్వయంతో శాస్త్రీయ పద్ధతిలో డంపింగ్ యార్డ్ నిర్వహణ, ప్రజలకు శాశ్వత ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని కోరారు.



అఖిలపక్ష సమావేశానికి పిలుపు:

ఈ నేపథ్యంలో రేపు మంగళవారం నవంబర్ 03 ఉదయం 11 గంటలకు నాగారంలోని ఎం వై ఆర్ ఫంక్షన్ హాల్ లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు వజ్రేష్ యాదవ్ ప్రకటించారు.

హాజరైన నాయకులు:

ఈ ఢిల్లీ భేటీలో జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, పల్లె సత్యం వంశరాజ్, మాజీ కార్పొరేటర్ సంగారెడ్డి మనోధర్ రెడ్డి, ప్రేమల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మాట్ల వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శులు గజ్వేల్ శంకర్, డీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, నాయకం భాస్కర్, కోశాధికారి పోలాస కిరణ్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వీర్ల భుజంగం, కొలిపాక సాయికిరణ్, కన్నెబోయిన రాజు యాదవ్, జడల బాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, వడుపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు ప్రదర్శన..

- ప్రజలు సందర్శించి చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలి . జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త నవంబర్ 02 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ హ్యాండ్లూమ్స్, తెలంగాణ రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ, చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండలోని రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ హాల్, ఎన్.జి.ఓఎస్ కాలనీ లో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.

ఈ చేనేత వస్త్ర ప్రదర్శన నవంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు మొత్తం 14 రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.

చేనేత కార్మికులకు ప్రోత్సాహం లక్ష్యం

చేనేత కార్మికుల నైపుణ్యాన్ని ప్రోత్సహించడం, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలను కల్పించడం, చేనేత వస్త్రాలపై ప్రజలకు అవగాహన పెంపొందించడం



లో ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. చేనేత కార్మికులకు నిరంతర పని మరియు ఉపాధి కల్పించడంతో పాటు, వారు తయారు చేసిన వస్త్రాలకు డిమాండ్ పెంచేందుకు ఈ ప్రదర్శన దోహదపడుతుందని పేర్కొన్నారు.

వివిధ రాష్ట్రాల ప్రత్యేక చేనేత వస్త్రాలు

ఈ ప్రదర్శనలో గద్వాల్, పోచంపల్లి, వెంకటగిరి, ఉప్పాడ, మంగళగిరి, ధర్మవరం తదితర ప్రాంతాలకు చెందిన ప్రత్యేక చేనేత చీరలు, డ్రెస్ మెటీరియల్స్, కరీంనగర్ బెడ్‌షీట్లు, బంగిమ్స్, టవల్స్‌తో పాటు వివిధ రకాల నాణ్యమైన చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచనున్నారు.



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన సుమారు 60 ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ఏ డి హ్యాండ్లూమ్ శ్రీకాంత్ రెడ్డి, వరంగల్ ఆర్డీవో సుమ నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, డి సి ఓ నీరజ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు,ఫిషరీస్ శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రజలు ఈ ప్రదర్శనను సందర్శించి, వివిధ రాష్ట్రాల ప్రత్యేక చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు

ఎమ్మెల్సీ ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

- స్వీప్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ ఓ సిటీ నుంచి కాశీబుగ్గ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ

మన మీ వార్త నవంబర్ 02 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై అర్హులైన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో స్వీప్ (ఎఎజుజుూ) కార్యక్రమంలో భాగంగా సోమవారం వరంగల్ ఓ సిటీ నుంచి కాశీబుగ్గ సర్కిల్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రజలకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ...

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా



ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఓటరు నమోదు ప్రక్రియపై సరైన అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, ఓటు హక్కు వినియోగంపై



ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఓటరు నమోదు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ంఈ ర్యాలీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్,అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డియార్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ వసంత, స్వీప్ నోడల్ అధికారి.. మరియు తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ ప్రజావాణి అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త నవంబర్ 02 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టరేట్ తో పాటు ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం

ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.

సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని త్వరగా పరిష్కరించాలన్నారు.

ప్రజావాణి అనేది ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని, దీనిపట్ల ఏ అధికారి కూడా నిర్లక్ష్యం వహించరాదన్నారు

ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు

ఆయా శాఖలకు సంబంధించిన ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో ఉండకుండా పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ఈనాటి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 232 అర్జీలు అందాయి.

ఇందులో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో 116 అర్జీలు అందగా, ఆర్డీవో కార్యాలయాల్లో 21, ఎంపీడీవో కార్యాలయాల్లో 95 అర్జీలను అధికారులు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి చెరువులో శవమై తేలాడు

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి నవంబర్ (2):



అదృశ్యమైన వ్యక్తి మృతదేహం చెరువులో లభ్యమైన సంఘటన బిజిలిపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది.

పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిజిలిపూర్ గ్రామానికి చెందిన కుక్కల రాజు (35) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఆరు సంవత్సరాల క్రితం నర్సాపూర్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన దీపతో వివాహం జరిగింది అయితే వివాహమైన రెండేళ్ల తర్వాత నాలుగేళ్ల క్రితం భార్య దీప విడాకులు తీసుకొని తన తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది.

ఈ క్రమంలో అక్టోబర్ 31న రోజువారీ విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన రాజు రాత్రి 8 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు.ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు.ఆదివారం గ్రామ సమీపంలోని వీరప్ప చెరువు వద్ద వెతకగా రాజుకు చెందిన ప్యాంటు, షర్టు,షూస్ కనిపించాయి. దీంతో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి నీట మునిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ చెరువులో గాలింపు చర్యలు చేపట్టిన మృతదేహం ఆచూకీ లభించలేదు.సోమవారం ఉదయం మృతదేహం చెరువులో తేలడంతో రాజు తండ్రి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మూత్రదేహాన్ని ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు.

ఎంఎంసి పరిధిలోని ప్రభుత్వ బోర్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

- ప్రజావాణిలో వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు

బోడుప్పల్ సర్కిల్ నవంబర్ 02(మన మీ వార్త)





మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ బోర్ల వద్ద వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా ఇంకుడు గుంతలు, ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ మేడ్చల్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ దాసరి మహేష్ యాదవ్, ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎండోమెంట్ కన్వీనర్ ఆదిమూలం కరుణాకర్, బోడుప్పల్ లేబర్ సెల్ కన్వీనర్ జెల్ల నర్సింగ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

బల్దియా ఇంచార్జి అదనపు కమిషనర్‌గా సమ్మయ్య

మన మీ వార్త నవంబర్ 02 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



బల్దియా ఇంచార్జి అదనపు కమిషనర్‌గా నియమితులైన సమ్మయ్య సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ టి.వెంకన్నను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కమిషనర్ జోనా పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీ నేపథ్యంలో సీనియర్ అధికారి అయిన సమ్మయ్యకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు.

నరకాసుర వధ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి: జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న





మన మీ వార్త నవంబర్ 02 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

- వివిధ శాఖల అధికారులకు ఏర్పాట్లపై దిశానిర్దేశం

- విధి నిర్వహణలో వాకీటాకీల వినియోగం తప్పనిసరి

దీపావళి సందర్భంగా ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించనున్న నరకాసుర వధ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు.

సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం కౌన్సిల్ హాల్‌లో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమైన కమిషనర్ మాట్లాడుతూ, కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బారికేడ్లు, లైటింగ్, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఏర్పాట్లన్నింటినీ కాశీబుగ్గ డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షించాలని ఆదేశించారు.

అదేవిధంగా , విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన వాకీటాకీలను తప్పనిసరిగా వినియోగించాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు ఇచ్చే సూచనలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ద్వారా సమన్వయంతో విధులు నిర్వహించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సమ్మయ్య, ఎస్ఈ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ముఖ్య ఉద్యానవన అధికారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, కార్యదర్శి అనిల్‌బాబు, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా.నిర్ణీత ధరలకే బియ్యం విక్రయించాలి.. ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలి.

- నియమ నిబంధనలకు విరుద్ధంగా బియ్యం విక్రయిస్తే చర్యలు.
- వినియోగదారులకు తప్పనిసరిగా బిల్లులు అందించాలి.
- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి షా ఫైజల్ హుస్సేని.

మన మీ వార్త నవంబర్ 02 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



జిల్లాలో వ్యాపారులు నిర్ణీత ధరలకే బియ్యం విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి షా ఫైజల్ హుస్సేని ఒక ప్రకటనలో తెలిపారు. రైస్‌మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు బియ్యం ధరల పట్టికను వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 26 కిలోల బస్తా విక్రయించే బియ్యానికి కిలోకు గరిష్ఠ రిటైల్ ధరలు బీపీటీ/కేఎన్ఎం రకానికి రూ. 66, ఆర్ఎన్ఆర్/తెలంగాణ సోనాకు రూ. 74, హెచ్ఎంటీ/జేఎస్ఆర్ రకానికి రూ. 79గా పేర్కొన్నారు. ఆయా రకాల బియ్యాన్ని నిర్ణయించిన ధరలకు మించి విక్రయించరాదని స్పష్టం చేశారు.

వినియోగదారుల నుంచి అధికంగా వసూలు చేయడం, తూకంలో తేడాలు చూపడం, నాణ్యతకు విరుద్ధంగా బియ్యం విక్రయించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి కొనుగోలుకు వినియోగదారులకు తప్పనిసరిగా బిల్లు అందించాలని వ్యాపారులకు సూచించారు.

వినియోగదారులు బియ్యం కొనుగోలు సమయంలో ధర, తూకం, నాణ్యతను పరిశీలించి బిల్లు తీసుకోవాలని కోరారు. అధిక ధరలకు విక్రయించినా, ఇతర అక్రమాలను గుర్తించినా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ వైఫల్యాలపై యువత ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలి -- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.

మన మీ వార్త నవంబర్ 02 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

- రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేసింది.....
- యువశక్తే దేశానికి వెన్నెముక: వరంగల్ జిల్లా బీజేవైఎం కార్యవర్గ సమావేశంలో గంట రవికుమార్.





వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో సోమవారం ధర్మారం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించబడింది. బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, బీజేవైఎం జిల్లా ప్రభారీ జలగం రంజిత్ రావు గార్లు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. ఏ దేశానికైనా యువతనే వెన్నెముక అని, దేశ భవిష్యత్తు యువశక్తిపైనే ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో యువతకు పెద్దపీట వేస్తుంటే, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం యువతను, నిరుద్యోగులను నిలువునా వంచిస్తోందని మండిపడ్డారు.

-సమాజంలో మార్పు తీసుకురాగల శక్తి ఒక్క యువతకే ఉందని, బీజేపీ ఎల్లప్పుడూ యువత ప్రోత్సాహానికి, వారి రాజకీయ ఎదుగుదలకు తోడ్పాటునందిస్తుందని గంట రవికుమార్ అన్నారు.

-ఎన్నికల ముందు విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చలేదని విమర్శించారు. ఫీజు రియంబర్స్మెంట్, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని, యువతను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆరోపించారు.

-కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, విద్యార్థుల, నిరుద్యోగుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని బీజేవైఎం శ్రేణులు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రజాపోరాటాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని స్పష్టం చేశారు.

-విద్యార్థుల, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, ఉద్యోగ నోటిఫికేషన్ల సాధన కోసం బీజేపీ యువమోర్చా ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు యువత అంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యవర్గ సమావేశంలో పలు విద్యా, ఉద్యోగ సమస్యలపై ధర్నాలు చేపట్టే విధంగా తీర్మానాలు చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, రాపాక ప్రశాంత్, జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శిలు అచ్చ దయాకర్, ఆడెపు రవిరాం మరియు బీజేవైఎం పదాధికారులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మురాసు తుఫాన్ ప్రభావంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి
- 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ సేవలు -- టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3424

మన మీ వార్త నవంబర్ 02 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



జిల్లాలో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

సోమవారం జిల్లా స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాన్ ప్రభావం, భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మురసు తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాలను అధికారులు ముందుగానే గుర్తించి అవసరమైన జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువులు, కుంటలు, వాగులు, వంకల వద్ద ప్రజలు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు సంబంధిత శాఖల సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

24 గంటలు కంట్రోల్ రూమ్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

హనుమకొండ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బందీ చర్యలు

- ప్రతీ బొట్టు సద్వినియోగం కావాలి
- లీకేజ్ లను అరికట్టాలి
- స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త నవంబర్ 02 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





జిల్లాలో ఎక్కడ కూడా రానున్న రోజుల్లో దాహార్తి సమస్య తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు

ఎల్ నీనో ప్రభావ పరిస్థితులను ఎదురుకునేందుకు వివిధ శాఖల అధికారులు చేపట్టాలిసిన చర్యల మీద సోమవారం కలెక్టరెట్ లోని కాన్ఫెరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మున్సిపల్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు

ముందుగా ఇరిగేషన్ అధికారులు జిల్లా లో ఉన్న ట్యాంక్ లలో ఉన్న నీటి సామర్థ్య వివరాలను తెలియజేశారు

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..... ఎల్ నీనో ప్రభావం వల్ల

తక్కువ వర్షపాతం నమోదు కావడం, భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉన్నందున..

రానున్న రోజుల్లో ప్రతి నివాస ప్రాంతానికి సరిపడేలా రక్షిత మంచినీరు సరఫరా అయ్యే విధంగా అధికారులు ఇప్పటి నుండే ప్రణాళికాబద్దంగా వ్యవహరించాలన్నారు. తాగునీటి సరఫరా తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా ప్రతీ గ్రామ పంచాయతీ లో, వార్డ్ లలో పర్యవేక్షించాలన్నారు

నీటి వృధాకు ఆస్కారం లేకుండా, అందుబాటులో ఉన్న నీటి వనరులు పూర్తిస్థాయిలో సద్వినియోగం అయ్యేలా గ్రామ,మండల, జిల్లా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు

వాటార్ సప్లై అవుతున్న సమయం లో లీకేజ్ లు ఏమైనా ఉన్నాయా అని గుర్తించాలన్నారు

ప్రతీ నెల మీటింగ్ పెట్టుకొని ఎల్ నీనో వల్ల ఏర్పడే సమస్య ల పైన కార్యాచరణ రూపొందించుకొని వాటిని ఎదుర్కొనేందుకు క్షేత్ర స్థాయి లో తగు చర్యలు తీసుకోవలన్నారు

ప్రతీ నీటి బొట్టు సద్వినియోగం అయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు

పైప్ లైన్ లలో , కార్ వాష్ సర్వీస్ లలో తదితర ప్రాంతాలలో నీటి వృధా ను అరికట్టాలన్నారు

అనంతరం ఎంపీడీఓ లను ఉద్దేశిస్తూ కలెక్టర్ మాట్లాడుతూ...

ఇందిరమ్మ ఇళ్ల కు సంబందించి వచ్చిన అప్లికేషన్ లను క్షేత్ర స్థాయి లో త్వరగా వెరిఫికేషన్ పూర్తి అవ్వాలన్నారు

వీబీ-జీ రామ్ జీ లో భాగం గా గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన జాబ్ కార్డ్ దారులు అందరికీ విధిగా ఉపాధి కల్పించాలని, కూలీలు ఎక్కువ సంఖ్యలో పనులకు వచ్చేలా ఎంపీడీఓ లు (టర్నోవర్ పెరిగేలా) పర్యవేక్షణ చేయాలన్నారు

ఈ సమావేశం లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, ణవీనూ, ఎంపీడీఓ లు పాల్గొన్నారు

ములుగు జిల్లా.ప్రతి రైతు ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలి.

- మొబైల్ యాప్ ద్వారా రైతులకు స్వీయ నమోదు సౌకర్యం.
- ఫార్మర్ రిజిస్ట్రీ నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలి.
- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి.

మన మీ వార్త నవంబర్ 02 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





జిల్లాలోని ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకొని ఫార్మర్ ఐడీ పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి సూచించారు.

ఇంకా నమోదు చేసుకోని రైతులను గుర్తించి, నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునేలా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు.

సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో అగ్రిస్టాక్--ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు, జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటుపై జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావుతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫార్మర్ రిజిస్ట్రీ, జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

జిల్లాలోని ప్రతి రైతు ఫార్మర్ ఐడీ పొందేలా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఫార్మర్ ఐడీ వివిధ శాఖల సేవలను పొందేందుకు ఏ విధంగా ఉపయోగపడుతుందనే అంశంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు తమ సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి లేదా మీసేవ కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవచ్చని వివరించారు.

తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఆండ్రాయిడ్ మొబైల్ యాప్ ద్వారా రైతులు స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మొబైల్ యాప్ ద్వారా స్వీయ నమోదు చేసుకునే విధానాన్ని జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు.

స్వీయ నమోదు విధానానికి సంబంధించిన వీడియోను వివిధ శాఖల అధికారులు, రైతుల వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా పంచుకోవాలని సూచించారు. ఇంకా నమోదు చేసుకోని ప్రతి రైతుకు సమాచారం చేరవేసి, ఫార్మర్ రిజిస్ట్రీ నమోదులు పెరిగేలా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జనగామ నవంబర్ నెలను "ప్రత్యేక హాజరు మాసం -- 100 శాతం హాజరు లక్ష్యం"గా నిర్వహణ

- విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది విధిగా పాఠశాలలకు హాజరయ్యేలా ప్రత్యేక కార్యాచరణ
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ చర్యలు

మన మీ వార్త నవంబర్ 02 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని గణనీయంగా పెంచి, ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర సమగ్ర శిక్ష సూచనల మేరకు, నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు "ప్రత్యేక హాజరు మాసం -- 100 శాతం హాజరు డ్రైవ్" నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ వెల్లడించింది.

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, రెసిడెన్షియల్, ఇతర యాజమాన్యాల పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఖీ=నా) ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ప్రతిరోజూ నమోదు చేయాలని, ఒక్క పాఠశాలలో కూడా హాజరు నమోదు కాకుండా ఉండకూడదని లక్ష్యంగా నిర్దేశించారు. విద్యార్థుల హాజరు వంద శాతానికి చేరుకునేలా వారానికొకసారి పురోగతిని సమీక్షించనున్నారు.

వరుసగా ఐదు రోజులు (లేదా) అంతకంటే ఎక్కువ రోజులు పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో సంప్రదింపులు జరపడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకుంటారు.

విద్యార్థులు తిరిగి పాఠశాలలకు హాజరయ్యేలా తగిన చర్యలు చేపడతారు.

అదే విధంగా పెండింగ్‌లో ఉన్న ఓడీ (ాణ) నమోదులను 24 గంటల్లోగా పరిష్కరించాలని, ఎఫ్ఆర్ఎస్ (ఖీ=నా) పరికరాలు, నెట్‌వర్క్ విద్యార్థుల నమోదు, తదితర సాంకేతిక సమస్యలను 48 గంటల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు.

మండలాల వారీగా రోజువారీ హాజరు పర్యవేక్షణ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు మండలాల వారీగా రోజువారీ హాజరు డ్యాష్‌బోర్డును నిర్వహించనున్నారు. ప్రతి మండల విద్యాశాఖాధికారి (వీజూా) తమ పరిధిలోని పాఠశాలల హాజరు వివరాలు, ఖీ=నా నమోదు స్థితి, విద్యార్థులు, సిబ్బంది హాజరు శాతాన్ని ప్రతిరోజూ సమీక్షించి, జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి నివేదించాలి.

క్లస్టర్ హెడ్‌లు వారానికి ఒకసారి పాఠశాలలను సమీక్షించి, హాజరు శాతం తగ్గుతున్న పాఠశాలలను గుర్తించి అవసరమైన సూచనలు అందిస్తారు. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ (వామీజ) సమావేశాలు నిర్వహించి విద్యార్థుల క్రమబద్ధమైన హాజరు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించనున్నారు.

ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని అటెండెన్స్ నోడల్ టీచర్‌గా నియమించి, రోజువారీ హాజరు పర్యవేక్షణ, తల్లిదండ్రులతో సంప్రదింపులు, గైర్హాజరు విద్యార్థుల వివరాలపై పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించనున్నారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్న పాఠశాలల్లోని ఉత్తమ విధానాలను ఇతర పాఠశాలల్లోనూ అమలు చేసేలా చర్యలు తీసుకోనున్నారు.

100 శాతం హాజరు సాధించిన పాఠశాలలకు ప్రశంసలు

ప్రత్యేక హాజరు మాసంలో వంద శాతం హాజరు సాధించిన పాఠశాలలు, గణనీయమైన పురోగతి సాధించిన పాఠశాలలు, సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టిన మండలాలు, క్లస్టర్లు, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించిన పాఠశాలలను గుర్తించి, ప్రశంసా పత్రాలు, అభినందన సందేశాలతో ప్రోత్సహించనున్నారు. రాష్ట్ర మార్గదర్శకాల ప్రకారం నెల మొత్తం విద్యార్థులు, సిబ్బంది వంద శాతం హాజరు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక అభినందనలు లభించనున్నాయి.

జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రతి వారం సమీక్షలు నిర్వహించడంతో పాటు, నవంబర్ 22 నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయిలో సమగ్ర పురోగతిని సమీక్షించనున్నారు. రాబోయే విద్యా సంవత్సరంలోనూ మెరుగైన హాజరు శాతాన్ని కొనసాగించేలా కార్యాచరణ రూపొందించనున్నారు.

విద్యార్థుల ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు, ఇతర సమంజసమైన కారణాలను పరిగణనలోకి తీసుకుంటూ, ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రతి విద్యార్థి పాఠశాల విద్యను నిరంతరాయంగా కొనసాగించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని అన్ని వర్గాలు సహకరించాలని జిల్లా విద్యా శాఖ కోరింది.

"ప్రతి రోజు పాఠశాలకు -- ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య" అనే లక్ష్యంతో జిల్లాలో ప్రత్యేక హాజరు మాసాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా విద్యా శాఖ కట్టుబడి ఉందని వెల్లడించింది.

దీపావళికి గ్రీన్ క్రాకర్స్‌కు సుప్రీంకోర్టు ఓకే!



న్యూఢిల్లీ: దీపావళి పండుగ సందర్భంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో పర్యావరణహిత బాణాసంచా కాల్చేందుకు సుప్రీంకోర్టు పరిమిత అనుమతులు మంజూరు చేసింది. నవంబర్ 7, 8 తేదీల్లో మాత్రమే గ్రీన్ క్రాకర్స్ వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, తిరిగి రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చేందుకు అనుమతించింది. నవంబర్ 9 నుంచి బాణాసంచాపై తిరిగి పూర్తి స్థాయి నిషేధం అమల్లోకి వస్తుందని వెల్లడించింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ఆరోగ్య కేంద్రాలు, సైలెన్స్ జోన్‌లకు 300 మీటర్ల పరిధిలో బాణాసంచా కాల్చడంపై నిషేధం విధించింది. బేరియం వినియోగించిన టపాసులతో పాటు, గ్రీన్ క్రాకర్స్‌గా ధ్రువీకరణ పొందని బాణాసంచా విక్రయాలను అడ్డుకోవాలని అధికారులను ఆదేశించింది. హండ్రెడ్ వాలా, థౌజండ్ వాలా వంటి భారీ శబ్దాలు చేసే టపాసుల వినియోగాన్ని కూడా అనుమతించబోమని స్పష్టం చేసింది.

కాలుష్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరం

గతంలో జారీ చేసిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అధికారుల మధ్య సమన్వయ లోపమే ఇందుకు ప్రధాన కారణమని అభిప్రాయపడింది. పండుగ సమయంలోనే కాకుండా, ఆ తర్వాత కూడా పర్యావరణ కాలుష్యంపై నిరంతరం సమీక్ష జరగాలని సూచించింది. కేంద్ర, ఢిల్లీ కాలుష్య నియంత్రణ మండళ్ల పర్యవేక్షణ కేంద్రాల నుంచి గాలి నాణ్యత సూచీ వివరాలను సేకరించాలని ఆదేశించింది.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

కాలుష్యం కారణంగా ఆస్పత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య, మరణాల వివరాలను ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల నుంచి సేకరించాలని ధర్మాసనం పేర్కొంది. పటాకుల వల్ల గాలి, శబ్ద కాలుష్యం పెరిగి చిన్నారులు, దివ్యాంగులు, వృద్ధులు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రకృతిలోని పంచభూతాలను పూజించే సంస్కృతి మనదని, ఏ మతాచారమైనా ప్రకృతి పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని వ్యాఖ్యానించింది.

దియామీర్జా వీడియోపై వివాదం.. తొలగించిన బీఎంసీ

మరోవైపు పర్యావరణహిత దీపావళిపై బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) రూపొందించిన ప్రచార వీడియో వివాదానికి దారితీసింది. సినీనటి దియా మీర్జా నటించిన ఈ వీడియోలో కాలుష్యానికి దూరంగా దీపావళి జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే బీజేపీ నాయకుడు అమిత్ సతమ్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీపావళి ఎలా జరుపుకోవాలో ఎవరి దగ్గరా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో వివాదం చెలరేగడంతో బీఎంసీ తన సోషల్ మీడియా ఖాతాల నుంచి ఆ వీడియోను తొలగించింది. కాలుష్య రహిత దీపావళిపై అవగాహన కల్పించేందుకు బీఎంసీ చేపట్టిన ప్రచారంలో భాగంగానే ఈ వీడియో రూపొందించారు.

భారత వైమానిక దళానికి కొత్త అధిపతి



న్యూఢిల్లీ: భారత వైమానిక దళానికి కొత్త అధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దేశానికి 42 ఏళ్లపాటు విశిష్ట సేవలందించిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అశుతోష్ దీక్షిత్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. భారత వైమానిక దళానికి అద్భుతమైన నాయకత్వాన్ని అందించగల సమర్థుడైన వాయు యోధుడిగా దీక్షిత్‌ను కొనియాడారు.

స్వదేశీ రక్షణ సామర్థ్యాలకు ప్రాధాన్యం

వైమానిక దళ పోరాట సంసిద్ధతను మరింత బలోపేతం చేయడం, కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించడం, స్వదేశీ రక్షణ రంగాన్ని అభివృద్ధి చేయడం తన ప్రాధాన్యతలని అశుతోష్ దీక్షిత్ స్పష్టం చేశారు. సాంకేతిక ఆవిష్కరణలు, త్రివిధ దళాల మధ్య సమన్వయానికి కూడా ప్రాధాన్యం ఇస్తానని వెల్లడించారు.

నాలుగు దశాబ్దాల విశిష్ట సేవలు

నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన అశుతోష్ దీక్షిత్ 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళ ఫైటర్ విభాగంలో చేరారు. తన సుదీర్ఘ కెరీర్‌లో కార్యాచరణ, విమాన పరీక్షలు, సామర్థ్యాల అభివృద్ధి, సంయుక్త రక్షణ వ్యవహారాలు వంటి కీలక విభాగాల్లో పనిచేశారు. నిష్ణాతుడైన ఫైటర్ పైలట్‌తో పాటు ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్, టెస్ట్ పైలట్‌గా గుర్తింపు పొందారు. మిరాజ్-2000, మిగ్ విమానాల వివిధ రకాలు, జాగ్వార్, రవాణా విమానాలను నడిపిన ఆయనకు 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం ఉంది.

వైమానిక దళ ఆధునీకరణలో కీలక పాత్ర

భారత వైమానిక దళ ఆధునీకరణలో దీక్షిత్ కీలక పాత్ర పోషించారు. జాగ్వార్, మిగ్-27 విమానాల ఆధునీకరణ ప్రాజెక్టులతో పాటు స్వదేశీ తేజస్ ఎల్‌సీఏ మార్క్-1 యుద్ధ విమానానికి ప్రారంభ, తుది కార్యాచరణ అనుమతుల ప్రక్రియలో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించారు. మిరాజ్-2000 స్క్వాడ్రన్, బీదర్ వైమానిక స్థావరం సహా పలు కీలక విభాగాలకు నాయకత్వం వహించారు.

ఆపరేషన్ సింధూర్‌లోనూ కీలక బాధ్యతలు

సదరన్ ఎయిర్ కమాండ్‌లో ఎయిర్ డిఫెన్స్ కమాండర్‌గా, సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌లో సీనియర్ ఎయిర్ స్టాఫ్ ఆఫీసర్‌గా పనిచేశారు. డిప్యూటీ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్, సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వంటి కీలక పదవులు చేపట్టారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్‌కు చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా సేవలందించారు. వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా కూడా పనిచేశారు.

పతకాలతో విశిష్ట గుర్తింపు

సైనిక సేవలకు గుర్తింపుగా అశుతోష్ దీక్షిత్‌కు 2026లో పరమ విశిష్ట సేవా పతకం, 2023లో అతి విశిష్ట సేవా పతకం, 2011లో విశిష్ట సేవా పతకం, 2006లో వాయుసేన పతకం లభించాయి. నాలుగు దశాబ్దాల అనుభవంతో ఇప్పుడు దేశ వైమానిక దళానికి నాయకత్వం వహించనున్నారు.

రోడ్డు పనుల్లో పెను విషాదం



ఝుంఝునూ: రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఝుంఝునూ జిల్లాలోని ఉదయ్‌పుర్‌వాటి ప్రాంతం ఛాపోలీ గ్రామంలో ఈ దుర్ఘటన జరిగింది. రోడ్డు పనుల్లో ఉపయోగిస్తున్న యంత్రం 11 వేల వోల్టుల సామర్థ్యం కలిగిన విద్యుత్ తీగలకు తగలడంతో ఈ ప్రమాదం సంభవించింది.

యంత్రానికి విద్యుత్ సరఫరా.. కుప్పకూలిన కార్మికులు

గ్రామస్థుల సహకారంతో ఛాపోలీ గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కంకర కలిపేందుకు ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కదమ్ కుండ్ వైపు వెళ్లే రహదారిపై పనులు జరుగుతుండగా యంత్రం పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో ఒక్కసారిగా యంత్రంలోకి విద్యుత్ ప్రవహించింది. సమీపంలో పనిచేస్తున్న కార్మికులు విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయారు. ప్రమాద తీవ్రతకు అక్కడివారికి స్పందించే అవకాశం కూడా లేకుండా పోయింది. సమాచారం అందుకున్న గ్రామస్థులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆస్పత్రులకు తరలించారు.

ఘటనా స్థలానికి జిల్లా కలెక్టర్

ప్రమాదం గురించి గ్రామస్థులు ఫోన్ ద్వారా సమాచారం అందించారని ఝుంఝునూ జిల్లా కలెక్టర్ అరుణ్ గార్గ్ తెలిపారు. ప్రాథమిక వివరాల ప్రకారం ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించారని వెల్లడించారు. మరో ఆరుగురిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరిందని, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. సమాచారం అందిన వెంటనే తాను ఘటనా స్థలానికి బయలుదేరినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భగవానారామ్ సైనీ, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కూడా ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: సీఎం

ఈ దుర్ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్మికులు విద్యుదాఘాతంతో మృతి చెందడం హృదయవిదారకమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బాధ్యులెవరో తేల్చాలి: అశోక్ గహ్లోత్

మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ సైతం ఈ ఘటనపై స్పందించారు. రోడ్డు నిర్మాణ పనుల సమయంలో ఇంతటి ఘోర ప్రమాదం ఎలా జరిగిందో సమగ్రంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి బాధ్యులెవరో గుర్తించాలని అధికారులను కోరారు. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందించడంతో పాటు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్ఐఆర్ దెబ్బ..
ఐదు రాష్ట్రాల్లో 2.28 కోట్ల ఓట్లు మాయం!



న్యూఢిల్లీ: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రభావం ఐదు రాష్ట్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, పంజాబ్, మణిపుర్ రాష్ట్రాల్లో ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్‌కు ముందు ఈ ఐదు రాష్ట్రాల్లో కలిపి 18.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, సవరణ అనంతరం ఆ సంఖ్య 16.43 కోట్లకు పడిపోయింది. మొత్తంగా సుమారు 2.28 కోట్ల మంది ఓటర్ల పేర్లు తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

యూపీలో అత్యధికంగా తగ్గిన ఓటర్లు

ఈ ఐదు రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధికంగా ఓటర్ల సంఖ్య తగ్గింది. ఎస్ఐఆర్‌కు ముందు 15.44 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య తుది జాబితాలో 13.40 కోట్లకు చేరింది. అంటే సుమారు 2.04 కోట్ల మంది తగ్గారు. మొత్తం ఐదు రాష్ట్రాల్లో నమోదైన తగ్గుదలలో దాదాపు 90 శాతం ఉత్తరప్రదేశ్ నుంచే ఉంది. ఆ రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 13.24 శాతం తగ్గడం గమనార్హం.

అర్హులకు మరో అవకాశం

ఓటరు జాబితాలో పేర్లు గల్లంతైన అర్హులైన పౌరులు మరోసారి తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ప్రస్తుతం చేపడుతున్న ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియలో భాగంగా ఈ అవకాశం ఉంటుంది. అంతేకాకుండా 2027 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

బీజేపీ ప్రచారం బూమరాంగ్..
దిల్లీలో యథావిధిగా మార్కెట్లు!

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీ రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. ర్యాలీ కారణంగా నగరంలోని వ్యాపారాలు దెబ్బతింటాయని, మార్కెట్లు మూతపడతాయని బీజేపీ చేసిన ప్రచారాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఆదివారం దిల్లీలో దుకాణాలు యథావిధిగా తెరిచి ఉండటంతో పాటు వ్యాపార కార్యకలాపాలు కూడా కొనసాగాయని పేర్కొంది. బీజేపీ చేసిన ప్రచారం బెడిసికొట్టిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

ప్రజలను భయపెట్టే ప్రయత్నం విఫలం

ఇండియా కూటమి ర్యాలీకి ప్రజలు హాజరుకాకుండా అడ్డుకునేందుకు, కార్యక్రమం ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు అధికార పార్టీ ప్రయత్నించిందని జైరాం రమేశ్ ఆరోపించారు. రాజకీయ కార్యక్రమాల వల్ల వ్యాపారాలకు నష్టం జరుగుతుందన్న ప్రచారం అవాస్తవమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దిల్లీకి వచ్చిన ప్రజలు స్థానిక మార్కెట్లలో కొనుగోళ్లు చేయడం ద్వారా వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చారని తెలిపారు. పెద్ద వ్యాపార సంస్థలతో పాటు చిన్న దుకాణదారులు, వీధి వ్యాపారుల వద్ద కూడా కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు.

ఓటు చోరీ అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే..

దేశంలో చర్చనీయాంశంగా మారిన ఓటు చోరీ ఆరోపణలు, ఎన్నికల సంఘం జవాబుదారీతనం వంటి అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీ ఈ ప్రచారానికి తెరతీసిందని జైరాం రమేశ్ ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు, ఇండియా కూటమి ర్యాలీకి ప్రజలు రాకుండా నిరుత్సాహపరిచేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహించిన కార్యక్రమానికి మద్దతు ఇస్తూనే స్థానిక ఆర్థిక వ్యవస్థకు చేయూతనిచ్చిన దిల్లీ ప్రజలు, వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక వ్యాపారులకు రాహుల్ పిలుపు

ఇండియా కూటమి ర్యాలీ వల్ల వ్యాపారాలకు నష్టం వాటిల్లుతుందని పేర్కొంటూ ఓ వ్యాపారుల సంఘం రాహుల్ గాంధీకి లేఖ రాసి, ర్యాలీని వాయిదా వేయాలని కోరింది. దీనిపై స్పందించిన రాహుల్ గాంధీ.. దీపావళి సందర్భంగా దిల్లీకి వచ్చిన ప్రజలు స్థానిక వ్యాపారులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి సామాజిక మాధ్యమాల ద్వారా ఈ పిలుపునిచ్చారు. పండుగ కొనుగోళ్లను స్థానిక దుకాణాల్లోనే చేయాలని కోరారు. ర్యాలీ కారణంగా వ్యాపారాలకు ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాల ప్రశ్నలు

ఆదివారం జరిగిన ఇండియా కూటమి ర్యాలీలో ప్రతిపక్ష నేతలు బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల సంఘం బాధ్యతలపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మొత్తంగా ర్యాలీకి ముందు బీజేపీ చేసిన ప్రచారం, అనంతరం కాంగ్రెస్ చేసిన ఎదురుదాడితో దిల్లీ రాజకీయాలు వేడెక్కాయి.

పంజాబ్‌లో ఆప్‌కు భారీ షాక్..
బీజేపీలోకి ముగ్గురు ఎమ్మెల్యేలు!

చండీగఢ్: పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2027 అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ పార్టీకి చెందిన ముగ్గురు కీలక నేతలు భారతీయ జనతా పార్టీలో చేరారు. మాజీ ఐపీఎస్ అధికారి, అమృత్‌సర్ నార్త్ మాజీ ఎమ్మెల్యే కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్‌తో పాటు హర్మీత్ సింగ్ పఠాన్‌మాజ్రా, చేతన్ సింగ్ జౌరమాజ్రా సోమవారం బీజేపీ కండువా కప్పుకున్నారు. ఇప్పటికే ఆప్ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ విమర్శలు చేస్తున్న నేతలు ఒకేసారి పార్టీ మారడం పంజాబ్ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

పార్టీ నాయకత్వంతో విభేదాలు

హర్మీత్ సింగ్ పఠాన్‌మాజ్రా పటియాలా జిల్లాలోని సనౌర్ నియోజకవర్గానికి, చేతన్ సింగ్ జౌరమాజ్రా సమానా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో ఆప్ నాయకత్వం వీరిని సస్పెండ్ చేసింది. అనంతరం ఇద్దరూ పార్టీకి రాజీనామా చేశారు. వారి శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయాలని కోరుతూ స్పీకర్‌కు ఫిర్యాదు చేసేందుకు ఆప్ సిద్ధమైంది. మరోవైపు కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ కూడా సోమవారం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను అసెంబ్లీ స్పీకర్‌కు పంపించారు. 2025 జూన్ 29న ఆప్ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఆయన అప్పటి నుంచి పార్టీ నాయకత్వం, ప్రభుత్వ విధానాలపై బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు.

'పంజాబ్ ఫస్ట్'.. విజయ్ ప్రతాప్ స్పష్టం

బీజేపీలో చేరడానికి ముందు కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ ఎక్స్ వేదికగా అమృత్‌సర్ ప్రజలకు సందేశం ఇచ్చారు. తనకు ప్రజలు అందించిన ప్రేమ, గౌరవానికి జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పంజాబ్ ప్రస్తుతం మాదకద్రవ్యాల సమస్య, గ్యాంగ్‌స్టర్ల బెదిరింపులు, వసూళ్లు, అవినీతితో సతమతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛమైన రాజకీయాలు, పారదర్శక పాలన అందించేందుకు ప్రజలతో కలిసి పనిచేస్తానని తెలిపారు. తనకు వ్యక్తిగత ప్రయోజనాల కంటే పంజాబ్ అభివృద్ధే ముఖ్యమని, 'పంజాబ్ ఫస్ట్' అనేదే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ ఫ్రీ నగరమే లక్ష్యం!

-మొదటిపేజీ తరువాయి

అంశాలపై సీఎం చర్చించారు.

రోజూ ఇంటింటికీ చెత్త సేకరణ

నగరంలో చెత్త నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ చెత్త సేకరణ జరిగేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. చెత్త సేకరణ వాహనాలు నిర్ణీత సమయాల్లో ప్రతి ప్రాంతానికి చేరుకునేలా చూడాలని, ఎక్కడైనా చెత్త పేరుకుపోతే వెంటనే తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది బాధ్యతగా పనిచేసేలా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు

నగరంలో భవన నిర్మాణాలు, రోడ్ల పనుల నుంచి వెలువడే వ్యర్థాలు రహదారులపై పేరుకుపోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. నిర్మాణ వ్యర్థాలను సేకరించి నిర్ణీత ప్రాంతాలకు తరలించే విధంగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లోనూ చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా ఇండస్ట్రియల్ ఏరియా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పారిశ్రామిక వాడల్లో వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

తాగునీటి వినియోగానికి బదులుగా గ్రీన్ వాటర్

నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, గార్డెనింగ్, ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం పెంపు వంటి అవసరాలకు తాగునీటిని వినియోగించడం తగ్గించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీ) శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని ఆదేశించారు. తద్వారా తాగునీటిని ఆదా చేయడంతో పాటు శుద్ధి చేసిన నీటిని తిరిగి ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రీన్ వాటర్ ట్యాంకర్ల సేవలను



విస్తృతంగా వినియోగించుకునేలా ప్రజలు, నిర్మాణ సంస్థలు, వాణిజ్య సంస్థల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. తాగునీటికి బదులుగా శుద్ధి చేసిన నీటిని ఉపయోగించేలా ప్రోత్సహించాలన్నారు.

19 ఎస్టీపీల నుంచి 28 గ్రీన్ ట్యాంకర్లు

జలమండలి ఇప్పటికే తొలి విడతలో 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ సేవలను మరింత విస్తరించాలని సీఎం ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధితో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధుల్లోనూ గ్రీన్ వాటర్ సరఫరా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలోని ప్రభుత్వ కార్యాల యాలు, పార్కులు, పచ్చదనం అభివృద్ధి పనులు, నిర్మాణ రంగం వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటిని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ నీటిని తాగడానికి ఉపయోగించరాదనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తూ సరఫరా నిర్వహణ చేపట్టాలని సూచించారు.

ట్రాఫిక్ జామ్‌లకు చెక్ పెట్టాలి

హైదరాబాద్‌లో పెరుగుతున్న వాహనాల రద్దీ, ట్రాఫిక్ సమస్యలపై సీఎం ప్రత్యేకంగా సమీక్షించారు. నగరంలో వాహనదారులు ఎక్కువసేపు ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రధాన రహదారులు, రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల రాకపోకలు సాధ్యమైనంత వరకు నిరంతరా యంగా సాగేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లపై దృష్టి

సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు అవసర మైన ప్రాంతాలను గుర్తించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్లలో పరిస్థితులకు అనుగుణంగా అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణా నికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, రహదారుల విస్తీర్ణం, ట్రాఫిక్ రద్దీని పరిశీలించి తగిన ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ట్రాఫిక్ నిర్వహణలో ఆధునిక విధానాలను అనుసరిస్తూ నగర ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.

సమావేశంలో ఉన్నతాధికారులు

ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జి. సృజన తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో రేవంత్ సర్కార్ విఫలం

-మొదటిపేజీ తరువాయి

వైఫల్యం పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని సకాలంలో వినియోగించుకుంటే రైతులకు కొంతమేర ఉపశమనం కలిగేదని పేర్కొన్నారు. కృష్ణా నీటిని ఎత్తిపోసే విషయంలో ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు ప్రాంతంలో సాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చామని, వరుసగా ఎనిమిదేళ్ల పాటు కొన్ని ప్రాంతాల్లో రెండు పంటలు సాగయ్యాయని గుర్తుచేశారు. ప్రస్తుతం సాగునీరు అందక రైతులు పెట్టుబడులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

కల్వకుర్తి ఎత్తిపోతలపై ప్రభుత్వాన్ని నిలదీత

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా గతంలో 50 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని విమర్శించారు. సాగునీటి అవసరాలు ఉన్న సమయంలో నీటిని ఎత్తిపోసి పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శ్రీశైలం, జూరాల నుంచి వెంటనే నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్



చేశారు.

రైతులకు పరిహారం.. రైతుబంధు చెల్లించాలి

కరువు, నీటి కొరత కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని హరీశ్‌రావు కోరారు. పంట నష్టంపై సమగ్రంగా అంచనా వేసి బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. యాసంగి పంట సాగుకు అవసరమైన పెట్టుబడి సాయం రైతుబంధును వెంటనే విడుదల చేయాలని కోరారు. రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమవుతోందని విమర్శించారు.

కరువు మండలాల ప్రకటనతో సరిపెట్టొద్దు

రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించడంతోనే బాధ్యత ముగిసినట్లు భావించకూడదని హరీశ్‌రావు అన్నారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించి రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. పాలమూరు ప్రాంతంలో నెలకొన్న కరువు పరిస్థితులను అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక బృందాన్ని పంపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బృందం పర్యటించి పంట నష్టం, సాగునీటి కొరత, రైతుల ఇబ్బందులను పరిశీలించాలని కోరారు.

రైతులకు అండగా ఉంటాం

కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, ప్రజలకు భరోసా ఇవ్వడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు కూడా రైతుల సాగుపై ప్రభావం చూపుతున్నాయని విమర్శించారు. ప్రజల సంక్షేమం, రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వ్యాఖ్యానించారు. కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు అండగా నిలిచేందుకే తాము గ్రామాల్లో పర్యటిస్తున్నామని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

విద్యుత్ సిబ్బందికి దీపావళి కానుక

-మొదటిపేజీ తరువాయి

అమల్లోకి రానుంది. దీంతో జూలై నుంచి పెరిగిన డీఏకు సంబంధించిన బకాయిలు కూడా లబ్ధిదారులకు అందనున్నాయి. విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.

71,360 మందికి ప్రయోజనం

ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో మొత్తం 71,360 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రయోజనం కలగనుంది. పెరిగిన డీఏ, డీఆర్ కారణంగా విద్యుత్ సంస్థలపై నెలకు సుమారు రూ.14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా కొంత ఊరట కల్పించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఆరు నెలలకోసారి డీఏ సవరణ

కేంద్ర కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా కరువు భత్యం, కరువు ఉపశమనాన్ని సాధారణంగా ప్రతి ఆరు నెలల కోసారి సవరిస్తుంటారు. జనవరి, జూలై నెలలను ప్రాతిప దికగా తీసుకుని ఈ మార్పులు చేపడతారు. తాజాగా ధరల సూచీకి అనుగుణంగా విద్యుత్ సంస్థల ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ట్రాన్స్‌కోలో 9,194 మందికి లబ్ధి

తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (టీజీ ట్రాన్స్‌కో) పరిధిలో మొత్తం 9,194 మందికి ప్రయోజనం చేకూరనుంది. వీరిలో 3,081 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 3,644 మంది ఆర్టిజన్లు, 2,469 మంది పెన్షనర్లు ఉన్నారు.

జెన్‌కోలో 14,167 మందికి ప్రయోజనం

తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టీజీ జెన్‌కో) పరిధిలో 7,197 మంది ఉద్యోగులు, 3,544 మంది ఆర్టిజన్లు, 3,426 మంది పెన్షనర్లు ఉన్నారు. మొత్తంగా 14,167 మందికి డీఏ, డీఆర్ పెంపు వల్ల ప్రయోజనం కలగనుంది.



ఎస్పీడీసీఎల్‌లో అత్యధిక లబ్ధిదారులు

తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎస్పీడీసీఎల్) పరిధిలో అత్యధికంగా 28,481 మంది లబ్ధి పొందనున్నారు. వీరిలో 11,719 మంది ఉద్యోగులు, 8,493 మంది ఆర్టిజన్లు, 8,269 మంది పెన్షనర్లు ఉన్నారు.

ఎన్పీడీసీఎల్‌లో 19,518 మందికి లబ్ధి

తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎన్పీడీసీఎల్) పరిధిలో 9,936 మంది ఉద్యోగులు, 3,435 మంది ఆర్టిజన్లు, 6,147 మంది పెన్షనర్లు ఉన్నారు. మొత్తం 19,518 మందికి పెరిగిన డీఏ, డీఆర్ వర్తించనుంది.

విద్యుత్ రంగ భవిష్యత్తుపైనా దృష్టి

ఉద్యోగుల సంక్షేమంతో పాటు రాష్ట్ర విద్యుత్ రంగాన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాబోయే పదేళ్లలో తెలంగాణలో విద్యుత్ డిమాండ్ ఎంత మేర పెరిగే అవకాశం ఉందో ముందుగానే అంచనా వేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక విద్యుత్ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యుత్ గ్రిడ్‌లను ఆధునీకరించడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యుత్ అంతరాయాలను తగ్గించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తూనే ఉద్యోగుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

దీపావళికి ముందే ప్రకటన

దీపావళి పండుగకు ముందు ప్రభుత్వం తీసుకున్న డీఏ పెంపు నిర్ణయం విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ఆర్థికంగా కొంత ఊరటనివ్వనుంది. ముఖ్యంగా జూలై 1 నుంచి పెంపు అమలు కానుండటంతో అప్పటి నుంచి రావాల్సిన బకాయిలు కూడా అందనున్నాయి. మొత్తం 71,360 కుటుంబాలకు ఈ నిర్ణయం ద్వారా ప్రయోజనం కలగనుంది.

తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు చరమగీతం

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణను ఏటీఎంగా మార్చుకుని 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో వసూళ్లకు పాల్పడుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా రాహుల్ గాంధీకి ఈ డబ్బులు వెళు ్నాయని ఆరోపణలు చేశారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిందని, ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉందని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ వల్ల కాంగ్రెస్ పార్టీని కాపాడటం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ నిర్వహించిన మహా పాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా ప్రసంగించారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

తెలంగాణ పర్యటనలో భాగంగా సోమవారం మధ్యాహ్నం అమిత్ షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఇతర పార్టీ ముఖ్య నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు, ఎంపీ రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లోకతంత్ర బచావో.. అరాచకత హటావో

'లోకతంత్ర బచావో-అరాచకత హటావో' (ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం-అరాచకత్వాన్ని అంతం చేద్దాం) నినాదంతో తెలంగాణ బీజేపీ ఈ మహా పాదయాత్రను నిర్వహించింది. బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి యాత్ర ప్రారంభమైంది. అబిడ్స్ మీదుగా మోజంజాహీ మార్కెట్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మోజంజాహీ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు.

ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి?

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని అమిత్ షా విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని, తెలంగాణలో మాత్రం ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. మోదీ ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, ఆయన ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు లేవని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు.

ఈవీఎంలపై కాంగ్రెస్ విమర్శలకు కౌంటర్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల)పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలను అమిత్ షా తప్పుబట్టారు. ఈవీఎంల ద్వారానే ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయన్నది కాంగ్రెస్ వాదన అయితే, అదే ఈవీఎంలతో తెలంగాణలో కాంగ్రెస్ ఎలా విజయం సాధించిందని ప్రశ్నించారు. కేరళం, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆ పార్టీ విజయాలు ఎలా సాధ్యమయ్యాయని నిలదీశారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడల్లా ఈవీఎంలను తప్పుబట్టడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు.

కాంగ్రెస్ పతనం ఖాయం.. తెలంగాణలో బీజేపీదే అధికారం

దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాదరణ కోల్పోయి అధికారానికి దూరమవుతోందని అమిత్ షా వ్యాఖ్యానించారు. పార్టీని కాపాడటం రాహుల్ గాంధీ వల్ల కాదని ఎద్దేవా చేశారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, వచ్చే రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఎస్ఐఆర్‌పై విపక్షాల ఆరోపణలకు ప్రతిగా పాదయాత్ర

దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న విమర్శలకు సమాధానంగా ఈ పాదయాత్రను బీజేపీ నిర్వహించింది. ఢిల్లీలో ఇండియా కూటమి నేతలు నిర్వహించిన 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి ప్రతిగా ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టడంతో పాటు కాంగ్రెస్ రాజకీయ వైఖరిని ప్రజల్లో ఎండగట్టడమే లక్ష్యంగా బీజేపీ నేతలు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పాదయాత్ర తరహా కార్యక్రమాలను దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ చేపట్టేందుకు పార్టీ ప్రణాళిక రూపొందించింది.

కదంతొక్కిన కాషాయ శ్రేణులు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో మహా పాదయాత్ర చేపట్టారు. 'ఇండియా' కూటమి చేపట్టిన ప్రచారాన్ని తిప్పికొట్టే లక్ష్యంతో బీజేపీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ పాదయాత్ర సాగింది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' అనే నినాదంతో ఈ ర్యాలీని నిర్వహించారు. నగరంలోని బషీర్‌బాగ్‌లో ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఈ పాదయాత్ర ప్రారంభమైంది. జాతీయ జెండా చేతబూని అమిత్ షా ముందుకు సాగగా, ఆయనతో పాటు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. సుమారు 1.5 కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్ర మొజాంజాహీ మార్కెట్ వద్ద ముగియనుంది. అక్కడ జరిగే కార్నర్ మీటింగ్‌లో అమిత్ షా ప్రసంగించనున్నారు. ఢిల్లీలో ఆదివారం 'ఇండియా' కూటమి నిర్వహించిన ర్యాలీలో బీజేపీపై చేసిన విమర్శలకు ఆయన ఇక్కడ దీటైన సమాధానం ఇచ్చే అవకాశం ఉంది. పాదయాత్రకు ముందు, కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని అమిత్ షా సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "వరుస ఓటములతో కుంగిపోయిన కాంగ్రెస్, ఇప్పుడు అరాచక చర్యలతో ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి అయినా సరే అధికారాన్ని దక్కించుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ కుట్రపూరిత ప్రయత్నాల నుంచి మన ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ మహా పాదయాత్రలో పాల్గొంటున్నాను" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. నగర పర్యటనలో భాగంగా, తొలుత అమిత్ షా చారిత్రక చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఇతర బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర నేపథ్యంలో బషీర్‌బాగ్, నాంపల్లి, అబిడ్స్, కోఠి, అఫ్జల్‌గంజ్ సహా పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించి, వాహనాలను దారి మళ్లించారు.

రెవెన్యూ-అటవీ భూ వివాదాలపై జాయింట్ సర్వే.. నేనే పర్యవేక్షిస్తా: పొంగులేటి

హైదరాబాద్: రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ వివాదాల కారణంగా రైతులు, సామాన్య ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల సంయుక్త సర్వే ప్రక్రియను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. సచివాలయంలో రెవెన్యూ, అటవీ, సర్వే అండ్ సెటిల్‌మెంట్ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.

దశాబ్దాల వివాదాలకు తెరదించాలి

రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ భూముల మధ్య సరిహద్దులపై చాలా కాలంగా వివాదాలు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో అటవీ భూములు అధికంగా ఉన్న నేపథ్యంలో ఈ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. పట్టా భూములు, రెవెన్యూ భూములు, అటవీ భూముల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

జాయింట్ సర్వేతో స్పష్టమైన హద్దులు

రెండు శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి భూముల వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని పొంగులేటి ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సర్వే పద్ధతులను ఉపయోగించి భూముల హద్దులను కచ్చితంగా గుర్తించాలని సూచించారు.

తొలి వారాంతంలోనే రూ.75 కోట్ల వసూళ్లు.. వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం' బ్లాక్‌బస్టర్ !

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఆదర్శ కుటుంబం' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి వారాంతంలోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.75 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా చిత్ర బృందం 'బ్లాక్‌బస్టర్' అంటూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. దీంతో వెంకటేశ్ అభిమానులు, చిత్ర బృందం ఈ విజయాన్ని ఆనందంగా జరుపుకుంటున్నారు. చాలా కాలం తర్వాత వెంకటేశ్, త్రివిక్రమ్ కలిసి పనిచేయడంతో ఈ సినిమాపై మొదటి నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథాంశంతో రూపొందిన ఈ చిత్రంలో వెంకటేశ్‌కు జోడీగా శ్రీనిధి శెట్టి నటించారు. నివేదా పేతురాజ్, రావు రమేశ్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్ర బృందం ప్రకటించింది. తొలి వారాంతానికే ప్రపంచవ్యాప్తంగా రూ.75 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం సినిమాకు లభిస్తున్న ఆదరణను తెలియజేస్తోంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని నిర్మాతలు ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో 'బ్లాక్‌బస్టర్' అని ప్రకటిస్తూ వసూళ్ల వివరాలను వెల్లడించారు. విదేశీ మార్కెట్‌లోనూ 'ఆదర్శ కుటుంబం'కు మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా అమెరికాలో ఈ సినిమా ఇప్పటికే 10 లక్షల డాలర్లకు పైగా వసూళ్లు సాధించింది. మరోవైపు దేశీయంగా ప్రముఖ టికెట్ బుకింగ్ వేదిక బుక్‌మైషోలోనే 10 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ లెక్కలు సినిమాకు ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణను తెలియజేస్తున్నాయి. తొలి వారాంతంలో మంచి వసూళ్లు సాధించినప్పటికీ, సోమవారం నుంచి సినిమా వసూళ్లు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. సాధారణంగా వీకెండ్ హాలీడేస్‌లో థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అయితే వీక్ డేస్‌లోను అదే స్థాయిలో ప్రేక్షకులను ఆకర్షించగలిగితే సినిమా వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. కుటుంబ ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని రూపొందిన ఈ చిత్రానికి వచ్చే రోజుల్లో ఎలాంటి ఆదరణ లభిస్తుందో చూడాలి. తొలి వారాంతంలో రూ.75 కోట్ల మార్కును అందుకున్న 'ఆదర్శ కుటుంబం' వసూళ్లు మరింత పెరిగి కొత్త రికార్డులు సృష్టిస్తాయా? అనేది ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



ప్రేమలో దారుణంగా మోసపోయా, డిప్రెషన్‌లోకి వెళ్లా.. జీవితంలోని చేదు అనుభవాన్ని బయటపెట్టిన రెజీనా!



గ్లామరస్ పాత్రలకే పరిమితం కాకుండా, విభిన్నమైన కథలు, పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రెజీనా కసాండ్రా. కథానాయికగా మాత్రమే కాకుండా ప్రతినాయిక ఛాయలున్న పాత్రల్లోనూ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మూకుత్తి అమ్మన్ 2' సినిమాలో కీలకమైన ప్రతికూల ఛాయలున్న పాత్రలో కనిపించనున్నారు. తెలుగులో ఈ చిత్రం 'మహాశక్తి' పేరుతో విడుదల కానుంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న రెజీనా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించారు. గతంలో ప్రేమలో ఎదురైన చేదు అనుభవం తనను ఎంతగా కుంగదీసిందో వివరించారు. తన గత ప్రేమ బంధం గురించి మాట్లాడుతూ.. 2020లో తన జీవితంలో ఊహించని సంఘటన చోటుచేసుకుందని రెజీనా వెల్లడించారు. ప్రేమ బంధం అర్ధాంతరంగా ముగియడంతో పాటు, ఆ సంబంధంలో తాను తీవ్రంగా మోసపోయానని చెప్పారు. ఆ పరిణామం తనపై తీవ్ర మానసిక ప్రభావం చూపిందని, కొంతకాలం డిప్రెషన్‌తో బాధపడ్డానని తెలిపారు. ఆ బాధ నుంచి బయటపడటానికి చాలా సమయం పట్టిందని, ఆ అనుభవం తర్వాత కొంతకాలం ఎలాంటి కొత్త ప్రేమ బంధంలోకి వెళ్లకూడదని నిర్ణయించుకున్నానని రెజీనా పేర్కొన్నారు. ఆ సమయంలో ఎదురైన మానసిక సంఘర్షణ తన జీవితాన్ని మరో కోణంలో ఆలోచించేలా చేసిందని వివరించారు. కష్టకాలం నుంచి బయటపడటానికి తనకు తానే సమయం కేటాయించుకోవడం ఎంతో ఉపయోగపడిందని రెజీనా చెప్పారు. ఇతరుల నుంచి ప్రేమ, ఆదరణ, ఓదార్పు ఆశించే ముందు మనల్ని మనం ప్రేమించుకోవడం నేర్చుకోవాలని సూచించారు. ప్రేమలో ఎదురైన వైఫల్యాలే కాకుండా, చాలామంది యువతులు జీవితంలో ఏదో ఒక దశలో లైంగిక వేధింపులు, ఇతర చేదు అనుభవాలను ఎదుర్కొంటున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. తన స్నేహితులతో మాట్లాడినప్పుడు ఇలాంటి సమస్యలు ఎంత విస్తృతంగా ఉన్నాయో అర్థమైందని తెలిపారు. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు బాధితులు తమనే తాము నిందించుకోవద్దని రెజీనా సూచించారు. 'నాకే ఎందుకు ఇలా జరిగింది?' అని ఆత్మన్యూనతకు గురికాకుండా, జరిగిన విషయాలను మనసులో దాచుకోకుండా నమ్మకమైన వారితో పంచుకోవాలని చెప్పారు. ధైర్యంగా తమ బాధను బయటపెట్టినప్పుడే ఆ చేదు అనుభవాల నుంచి బయటపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

రామ్ చరణ్ 'ఆర్‌సీ 17'పై మరో ప్రచారం.. గుజరాతీ బ్లాక్‌బస్టర్ రీమేక్ అంటూ టాక్స్..!

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమాపై రోజుకో ఆసక్తికరమైన వార్త తెరపైకి వస్తోంది. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు పూర్తికాగా, విడుదలైన ప్రీ లుక్ పోస్టర్ మరింత ఆసక్తిని పెంచింది. అయితే తాజాగా ఈ సినిమా కథపై మరో ప్రచారం మొదలైంది. గుజరాతీలో సంచలనం సృష్టించిన 'లాలో' చిత్రానికి ఇది రీమేక్ అంటూ వార్తలు వైరల్ అయ్యాయి. కానీ ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తెలుస్తోంది. 'ఆర్‌సీ 17' ప్రీ లుక్ పోస్టర్ విడుదలైనప్పటి నుంచి సినిమా కథపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పోస్టర్‌లో ఉపయోగించిన రంగులు, చిత్రీకరణ శైలి నేపథ్యంలో ఈ సినిమాలో పౌరాణిక అంశాలు ఉండబోతున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా రామ్ చరణ్ శ్రీకృష్ణుడి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఈ విషయాలపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలా ఉండగా, గుజరాతీలో విడుదలై విజయం సాధించిన 'లాలో' (2025) సినిమాను తెలుగులో రామ్ చరణ్‌తో రీమేక్ చేయబోతున్నారంటూ వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఈ ప్రాజెక్టే సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆర్‌సీ 17' అని ప్రచారం మొదలైంది. దీంతో అభిమానుల్లోనూ ఆసక్తి పెరిగింది. అయితే ఈ రెండు సినిమాలకు ఎలాంటి సంబంధం లేదని తెలుస్తోంది. సుకుమార్ 2024 మార్చిలోనే రామ్ చరణ్‌తో తన తదుపరి సినిమాను ప్రకటించారు. అప్పటి నుంచే ఈ చిత్ర కథపై ఆయన పని చేస్తున్నారు. 'లాలో' విడుదలకు ముందే 'ఆర్‌సీ 17' కథలోని కీలక భాగాన్ని సుకుమార్ సిద్ధం చేసినట్లు సమాచారం. అందువల్ల ఈ సినిమా గుజరాతీ చిత్రానికి రీమేక్ అనే ప్రచారానికి ఆధారం లేదని స్పష్టమవుతోంది. మరోవైపు 'లాలో' చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేయబోతున్నారనే వార్తలు కూడా వినిపించాయి. అయితే ఆ రీమేక్‌లో రామ్ చరణ్ నటించడం లేదని, మరో హీరో ప్రధాన పాత్ర పోషించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దీంతో 'ఆర్‌సీ 17'ను 'లాలో' రీమేక్‌గా పేర్కొంటూ వస్తున్న వార్తలకు తెరపడినట్లయింది.



printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512